RNI NO. APTEL/2006/18110

## సన్నబియ్యం క్రెడిట్ సీఎం రేవంత్‌దే: ఉత్తమ్

హైదరాబాద్,మార్చి,30:రాష్ట్రంలో అమలవుతున్న ప్రతిష్టాత్మక సన్నబియ్యం పథకంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన అసెంబ్లీ వద్ద మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన ఆహారం అందించాలనే ఈ అద్భుతమైన ఆలోచన సీఎం రేవంత్ రెడ్డి దేనని, ఆ ఘనత పూర్తిగా ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ప్రభుత్వానికి ఎంత ఆర్థిక భారమైనా సరే పేద ప్రజలు గౌరవంగా, కడుపునిండా భోజనం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని మంత్రి స్పష్టం చేశారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

ప్రజాగళం

PGN NEWS

నిజామాబాద్ సంపుటి: 21 సంచిక: 103 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ మంగళవారం 31 - 3 - 2026 పేజీలు : 8 వెల : 1.00

# ఇక కల్తీ మాఫియా ఖేల్ ఖతం..

## తెలంగాణలో ఈగల్, హైడ్రా తరహాలో మరో సరికొత్త వ్యవస్థ... రేవంత్ రెడ్డి ప్రకటన

హైదరాబాద్,మార్చి,30:ఈగల్, హైడ్రా తరహాలో మరో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. మాదక ద్రవ్యాలను నిరోధించడానికి 'ఈగల్', హైదరాబాద్ నహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం 'హైడ్రా' అనే వ్యవస్థలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో ఆహార కల్తీ నియంత్రణ కోసం సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.సోమవారం ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, హైడ్రా,ఈగల్ తరహాలో సరి కొత్త వ్యవస్థను తీసుకువస్తామని అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామని తెలిపారు.రైతుల హక్కులను కాపాడేందుకు తాము కనీస మద్దతు ధర చట్టం తీసుకువచ్చామని గుర్తు చేశారు. పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని వాపోయారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలులో ఉన్న ఆహార భద్రతా చట్టాలను, వ్యవస్థలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామని సీఎం తెలిపారు. అధ్యయనం అనంతరం, పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రజా ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ మాఫియాకు గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈగల్, హైడ్రా తరహాలోనే ఈ కొత్త వ్యవస్థకు కూడా విస్తృత అధికారాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని కల్పించనున్నట్లు సమాచారం. రైతుల సమస్యలపైనా సీఎం స్పందించారు. పంటలకు ధర నిర్ణయించే అవకాశం రైతులకు లేకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. రైతుల అవసరాలను ఆసరగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం మండిపడ్డారు.



ఈ దళారీ వ్యవస్థకు చరమగీతం పాడి, రైతులకు సరైన న్యాయం చేసేందుకే తాము కనీస మద్దతు ధర (మీరా) చట్టాన్ని తీసుకువచ్చామని గుర్తు చేశారు. ఈ చట్టం రైతు హక్కులను కాపాడుతు ందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచడంపై కూడా సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే పెద్ద నేరమని ఆయన వ్యాఖ్యానించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించే అక్రమ నిల్వదారులను వదిలిపెట్టబోమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.వారి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

# ఏఐ వీడియోలతో అప్రమత్తం

## అస్సాం కార్యకర్తలకు మోదీ దిశానిర్దేశం

న్యూఢిల్లీ: క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టాలని, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ కార్యకర్తలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిశానిర్దేశం చేశారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నమో యాప్ ద్వారా 'మేరా బూత్ సబ్‌సే మజబూత్ సంవాద్' ప్రోగ్రాంలో ప్రధాని సోమవారంనాడు పాల్గొన్నారు. అస్సాంలో బీజేపీ–ఎన్డీయే మూడోసారి ఘనవిజయం సాధించేందుకు కార్యకర్తలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. కూటమికి రాష్ట్రంలో సంపూర్ణ మద్దతు ఉందని, కార్యకర్తల ఫీడ్‌బ్యాక్‌తో ప్రచారం మరింత పటిష్ఠమవుతుందని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా అస్థిరత ఉండేదని ప్రధాని అన్నారు. గత శతాబ్ద కాలంలో అనేక రంగాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు కాంగ్రెస్ హయాంలో పాలనను గుర్తించుకోవాలన్నారు. చిన్న పొరపాటు జరిగినా అస్సాం మళ్లీ వెనుక బాటపడుతుందని, నిలకడైన అభివృద్ధికి శాంతి, సుస్థిరత అనివార్యమని చెప్పారు. ఎన్నికల సమయంలో ఏఐ జనరేటెడ్ నకిలీ వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు ప్రధాని సూచించారు. తప్పుడు సమాచారంవల్ల ప్రజాస్వామ్య ప్రక్రియకు ఎలాంటి అవాంతరం కలుగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తిరుగుబాటు సంస్థలు, విద్యార్థి సంఘాలతో సురక్షితమైన ఒప్పందాలు చేసుకోవ డంలో గత



ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దాంతో ఈ ప్రాంతంలో సుదీర్ఘకాలం అశాంతి కొనసాగిందని తెలిపారు. కాగా, నియోజకవర్గాల పునర్విభజన తరువాత అస్సాంలోఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. 126 మంది సభ్యుల అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న పోలింగ్ జరు గనుంది. మే 4న ఫలితాలు వెలువడతాయి. ప్రస్తుత అసెంబ్లీలో అధికార బీజేపీకి 64మంది సభ్యుల బలంఉంది. దాని భాగస్వాపక్షమైన ఏజీపీకి 9 మందిఎమ్మెల్యేలు ఉన్నారు. యూపీపీఎల్‌కు 7,బీపీఎఫ్‌కుముగ్గురు ఎమ్మెల్యేలున్నారు. విపక్షంలో కాంగ్రెస్‌కు 26 మంది ఎమ్మెల్యేల బలం ఉండగా,ఏఐయూడీఎఫ్‌కు 15 మంది,సీపీఎంకు ఒక ఎమ్మెల్యే ఉన్నారు. ఒక ఇండిపెండెంట్ ఎమ్మెల్యే కూడా సభలో ఉన్నారు.

## ఓబీసీల పొట్ట కొట్టే ప్రయత్నం... లక్ష్మణ్



న్యూఢిల్లీ, మార్చి 30: రాజ్యసభలో ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావనకు తీసుకువస్తే కాంగ్రెస్ సహా విపక్షాలు అడ్డుకున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్, అన్ని విపక్షాలు ఏకమై తన గొంతు నొక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఓబీసీల్లో ముస్లింలను మూకుమ్మడిగా చేరుస్తున్నారని.. ఓబీసీలు వెనకపడటానికి కారణమవుతున్నారని,ఓబీసీల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతో సహా అందరూ అడ్డుకున్నారని తెలిపారు.కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సమాజాన్ని కులంగా గుర్తించి ఓబీసీ జాబితాలో చేర్చిందని.4 శాతం రిజర్వేషన్ ఇచ్చినట్లు ఎంపీ చెప్పారు. బెంగాల్,తమిళనాడు, కేరళ, తెలంగాణలోను ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు.

## హిందూ మతాన్ని, ఆలయాలను ప్రధాని మోదీ పట్టించుకోరు: రాహుల్

పాతానమిట్ట: కేరళలో ఏప్రిల్ 9వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో పాతానమిట్టలో జరిగిన సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీమాట్లాడారు. కేరళ పర్యటన వేళ శబరిమల అంశంపై ప్రధాని మోదీమౌనంగా ఉన్నారని ఆరోపించారు. దీని అర్థం బీజేపీ–ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదూర్‌లో జరిగిన కాంగ్రెస్ మీటింగ్‌లో ప్రసంగిస్తూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ ఎం,బీజేపీ పార్టీలను సంయుక్తంగా ఎదుర్కోబోతున్నట్లు తెలిపారు. తమ పార్టీఎల్డీఎఫ్ తో పోటీపడుతోందని, కానీ ఆ పార్టీకి బీజేపీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. బీజేపీతో ఎవరు పోరాడినా, వారిపై బీజేపీ అటాక్ చేస్తుందని, తనపై అటాక్ జరిగిందని, నాపై 36 కేసులు ఉన్నాయని, 55 గంటల పాటు నిర్విరామంగా తనను ప్రశ్నించారన్నారు. అయితే కేరళ సీఎం పినరయి విజయన్‌పై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఎల్డీఎఫ్ నాయకత్వం చాలా భ్రష్టుపట్టిందని, ఆ పార్టీ నేతలపై కేసులు ఉన్నాయని, కానీ బీజేపీ నుంచి వారిపై వత్తిడి లేదని, దర్యాప్తులు జరగడం లేదని, వాళ్లకు బెదిరింపులు



కూడా లేవని రాహుల్ గాంధీ అన్నారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి లెఫ్ట్ ఫ్రంట్ నేతలు బంగారాన్ని దోచుకెళ్లిన విషయాన్ని ప్రధాని మరిచిపోయారని రాహుల్ అన్నారు. బంగారాన్ని ఎత్తుకెళ్లిన లెఫ్ట్ ఫ్రంట్ నేతలు.. దాన్ని ఇత్తడితో నింపేశారని ఆరోపించారు.

## రెండు విడతల్లో ఏపీ, తెలంగాణలో జనగణన..

న్యూఢిల్లీ,మార్చి,30:ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రెండు విడతల్లో జనగణన జరుగుతుందని సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ తెలిపారు. ఏపీలో మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జనగణనలో భాగంగా ఇళ్ల సర్వే జరుగుతుందని వెల్లడించారు. ఏప్రిల్ 16వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు అవకాశం ఇస్తామన్నారు. ఇక, తెలంగాణలో మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇళ్ల సర్వే జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 26వ తేదీ నుంచి మే 10 తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు అవకాశం ఉంటుందని అన్నారు. జనాభా లెక్కల వివరాలన్నీ గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సోమవారం సెన్సస్ రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ మీడియాతో మాట్లాడుతూ.. 'సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో ప్రజలు సొంతంగా జనాభా లెక్కల వెబ్‌సైట్‌లో ఇళ్ల సర్వే వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇళ్ల సర్వేలో ఇంటి పరిస్థితి, ఇంటి వసతులు, వస్తువులు, ఇల్లు ఎస్సీ, ఎస్టీలకు చెందినదా వంటి 34 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. తొలివిడతలో గృహాల లెక్కింపు ఉంటుంది. ప్రతీ ఇంటి పరిస్థితి, సౌకర్యాలు, ఆస్తులు తదితర వివరాలు సేకరిస్తాం. ఏప్రిల్, సెప్టెంబర్ మధ్య 30 రోజులపాటు హౌస్ లిస్టింగ్ జరుగుతుంది.



హౌస్ లిస్టింగ్‌కు నెలరోజుల ముందు సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు 15 రోజులపాటు అవకాశం ఉంటుంది'.. 'సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పరిస్థితుల వివరాలతో పాటు వలసలు, సంతానో త్పత్తి స్థితిగతులకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తాం.

రెండో దశలో కులగణన వివరాలు సేకరిస్తాం. https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా స్వయంగా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. 11,718 కోట్ల రూపాయలతో జనాభా లెక్కల సేకరణ జరుగుతోంది. 16 భాషల్లో మొబైల్ యాప్ ద్వారానే జనాభా లెక్కల సేకరణ ఉంటుంది. ఎన్యుమరేటర్స్ సొంత మొబైల్స్ ద్వారానే జనాభా లెక్కలను సేకరిస్తారు' అని తెలిపారు.

## నామినేషన్ వేసిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్




చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంటోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సోమవారంనాడు తన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన కొలతూర్ నియోజకవర్గంలో రోడ్‌షోలో పాల్గొన్నారు. మూడుసార్లు కొలతూర్‌నియోజకవర్గం నుంచి గెలిచిన స్టాలిన్ మరోసారి తన అదృష్టాన్ని ఇక్కడి నుంచే పరీక్షించుకుంటున్నారు. డీఎంకే, సెక్యూలర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ అభ్యర్థిగా తనకు కొలతూర్ నియోజకవర్గం ప్రజలు మరోసారి భారీ విజయాన్ని అందించనున్నారని నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్టాలిన్ చెప్పారు. ఈవిషయంలో తాను చాలాగట్టినమ్మకంతో ఉన్నానని అన్నారు. ఎప్పటిలాగానే ఈసారి కూడా తమ ప్రచారం చాలాబలంగా ఉంటుందని తెలిపారు. డీఎంకే ఈ ఎ న్నికల్లో 234నియోజకవర్గాలకు గాను 164చోట్ల పోటీ చేస్తోంది. భాగ స్వామ్య పక్షాలు 70స్థానాల్లో పోటీలో ఉన్నాయి. వీటిలో కాంగ్రెస్ 28 స్థానాల్లో, సీపీఐ 5, సీపీఎం (మార్క్సిస్ట్) 5, వీసీకే 8, ఎండీఎంకే 4 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. డీఎండీకే సహా ఇతర చిన్న పార్టీలు 10 సీట్లలో పోటీలో ఉన్నాయి. 'సూపర్ మేనిఫెస్టో' పేరుతో డీఎంకే మేనిఫెస్టోను ఎంకే స్టాలిన్ ఆదివారంనాడు విడుదల చేశారు.

## నేపాల్ ఆరోగ్య మంత్రిగా ఢిల్లీ ఎయిమ్స్ విద్యార్థి..!

ఢిల్లీ ఎయిమ్స్ విద్యార్థిని ఒకరు ఇప్పుడు ఏకంగా నేపాల్ ఆరోగ్య మంత్రిగా నియమితులయ్యారు. మీరు చదివేది నిజమే.. ప్రస్తుతం పక్క దేశం అయిన నేపాల్ కొత్త ప్రభుత్వం కొలువు దీరిన విషయం తెలిసిందే. ఆ దేశ ప్రధానిగా బాలెన్ షా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఆయన పార్టీ రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ నుంచి పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్న నిషా మెహతా.. తాజాగా నేపాల్ ఆరోగ్య మంత్రిగా నియమితులయ్యారు. నిజానికి ఆమెకు భారతదేశంతో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఆమె తన బాల్యం నుంచే ఆరోగ్య సంరక్షణ రంగంలో చురుకుగా ఉన్నారు. నర్సింగ్ వృత్తి తర్వాత ఆమె రాజకీయాల్లోకి ప్రవేశించారు. ప్రస్తుతం నేపాల్‌లో పాలక పార్టీగా ఉన్న ఆరంభం నుంచి ఆమె అందులో ఒక సాధారణ సభ్యురాలిగా కొనసాగారు.



## కువైట్ విద్యుత్, నీటి శుద్ధి కర్మాగారంపై ఇరాన్ దాడులు.. భారతీయుడి మృతి



న్యూఢిల్లీ,మార్చి,30:పశ్చిమాసియాలో ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం ఇప్పుడు ఇతర గల్ఫ్ దేశాలకు పెను శాపంగా మారింది. కువైట్‌లోని ఒక కీలక విద్యుత్, నీటి శుద్ధీకరణ ప్లాంట్‌పై ఇరాన్ నిర్వహించిన డ్రోన్ దాడుల్లో ఒక భారతీయ కార్మికుడు మరణించాడు. కువైట్‌లోని విద్యుత్, నీరు, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖకు చెందిన ఒక ప్రధాన ప్లాంట్‌లోని సర్వీస్ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. ఈ దాడిలో అక్కడ విధి నిర్వహణలో ఉన్న భారతీయ పౌరుడు (టెక్నీషియన్ అని తెలుస్తోంది) మరణించగా, మరికొంతమంది గాయపడినట్లు సమాచారం. డ్రోన్ నేరుగా భవనాన్ని ఢీకొనడంతో కంట్రోల్ రూం తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల కువైట్‌లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అమెరికా తన యుద్ధనౌకలు, సైనిక బలగాలను గల్ఫ్ దేశాలలోని స్థావరాల నుంచి ఇరాన్‌పై దాడులకు ఉపయోగిస్తోందని ఇరాన్ ఆరోపిస్తోంది. అమెరికాకు సహకరిస్తున్న దేశాల ఆర్థిక మూలాలను.. ముఖ్యంగా విద్యుత్, నీటి ప్లాంట్లపై దాడులు చేస్తామని ఇరాన్ గతంలోనే హెచ్చరించింది. ఈ యుద్ధం ఇప్పుడు కేవలం రెండు దేశాల మధ్య కాకుండా, కువైట్, యూఏఈ, బహ్రెయిన్ వంటి దేశాలకు విస్తరిస్తోంది. పశ్చిమాసియాలో జరుగుతున్న ఈ యుద్ధంలో ఇప్పటివరకు సుమారు 8 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత గురువారం యూఏఈలో జరిగిన క్షిపణి దాడిలో ఒక భారతీయుడు మరణించగా, ఇప్పుడు కువైట్‌లో మరో ప్రాణం పోయింది.

# విద్యుత్ ఆర్టిసన్ ఆన్ మ్యాన్డ్,పీస్ రేటు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి..

## తెలంగాణ విద్యుత్ అర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి బోధన్ డివిజన్ చైర్మన్ గోవూరు రవి కిరణ్ డిమాండ్... విద్యుత్ ఆపరేషన్ డివిజన్ ఆఫీస్ ఎదుట కార్మికులు ధర్నా...




**బోధన్ ప్రతినిధి,మార్చి 30: (ప్రజా గళం):** విద్యుత్ ఆర్టిసన్ ఆన్ మ్యాన్డ్,పీస్ రేటు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలం గాణ విద్యుత్ అర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో సోమవారం బోధన్ పట్టణంలో విద్యుత్ ఆపరేషన్ డివిజన్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు.తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా తెలం గాణ విద్యుత్ అర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి బోధన్ డివిజన్ చైర్మన్ గోవూరు రవి కిరణ్ మాట్లాడుతూ.. విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగులను కనవర్షన్ చేయాలి అని,ఆర్టిసన్ లకు ఎపిఎస్ఇబి సర్వీస్ రూల్స్(అంటే ప్రస్తుతం ఉన్న ఓ అండ్ ఎం సర్వీస్ రూల్స్)అమలు చేయాలి అని డిమాండ్ చేశారు.టిజి ఎన్ పిడిసిఎల్ అలాగే టిజిఎస్ పిడిసిఎల్ లలో ఆన్-మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిసన్ లుగా విలీనం చేసుకోవాలని,విద్యుత్ సంస్థల్లో 4-12-2016 తేదీ కంటె ముందు అన్ని అర్హతలు ఉండి పనిచేస్తూ, ఇప్పటికి ఔట్ సోర్సింగ్,కాంట్రాక్ట్ కార్మికులుగా కొనసాగు తున్న వారిని ఆర్టిసన్ గా గుర్తించాలి అన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న పీస్ రేట్ కార్మికులకుజి.ఓ.నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం చెల్లించాలి,2026 పిఆర్ సి (వేతన సవరణ)అమలు చేయాలి అని అన్నారు. మార్చి 30 ఉదయం 10.30 గంటలకు అన్ని ఆపరేషన్ డివిజన్ ఆఫీస్ ల ఎదుట ధర్నా చేపట్టినట్లు అయన తెలిపారు. 2-4-2026 న ఉదయం 10:30 గంటలకు సర్కిల్ ఆఫీస్ ల ఎదుట వంట వార్పుతో ధర్నా చేపడు తున్నట్లు చైర్మన్ రవికిరణ్ తెలిపారు.అలాగే ఏప్రిల్ 8న సమ్మె చేపడుతున్నట్లు అయన తెలిపారు.ఈ ధర్నా కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సంజీవ్, కో-చైర్మన్ ధనుంజన్, కో-కన్వీనర్ లు వాహిద్,నవీన్, సభ్యులు శ్రావణ్,రాములు, శ్రీనివాస్ రెడ్డి,జగన్,శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులపై దాడి హేయమైన చర్య: నార్ల రత్నకుమార్



బాన్సువాడ,మార్చి 30, ప్రజాగళం.: నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సంతోష్ కుమార్ గుప్తాపై ఇటీవల జరిగిన భౌతిక దాడి ఘటనపై తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ చీఫ్ ఆర్గనైజర్, నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు నార్ల రత్న కుమార్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండిస్తూ, వైద్యులపై దాడులు చేయడం అనాగరిక చర్యగా అభి వర్ణించారు.ఈ సందర్భంగా నార్ల రత్న కుమార్ మాట్లాడుతూ, “వైద్య వృత్తి అనేది అత్యంత పవిత్రమైనది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను కాపాడేం దుకు అహర్నిశలు కష్టపడే వైద్యులు సమాజంలో దైవసమానులు అలాంటి వారిపై భౌతిక దాడులు చేయడం, అసభ్య పద జాలంతో దూషించడం పూర్తిగా అంగీకరించలేని విషయం” అని పేర్కొన్నారు. డాక్టర్ సంతోష్ కుమార్ గుప్తా వంటి నిబద్ధత కలిగిన వైద్యు లపై దాడి జరగడం చాలాబాధా కరమని,ఇటు వంటి ఘటనలు వైద్య రంగంపై ప్రజల్లో భయాందో ళనలు కలిగిస్తాయని ఆయన అన్నారు. వైద్యులు నిర్భయంగా సేవలు అం దించేందుకు ప్రభుత్వం భద్రతా చర్యలను మరింత కట్టు దిట్టం చేయాలని సూచించారు.ఈ దాడికి పాల్పడిన వారిపై వెంటనేకేసులు నమోదు చేసి,చట్ట పరమైన కఠిన చర్యలు తీసు కోవాలని నార్ల రత్నకుమార్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పున రావృతం కాకుండా ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేయా లని ఆయనకోరారు. అంతేకాకుండా, సమాజంలోని ప్రతి వ్యక్తి వైద్యులను గౌర వించడం, వారిసేవలను గుర్తిం చడం అత్యంత అవసరమని, సమస్యలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

# స్ప్రింగ్ ఫీల్డ్స్ స్కూల్‌లో మిల్లెట్స్ పై అవగాహన సదస్సు



నిజామాబాద్ వైద్య విభాగం మార్చి 30(ప్రజాగళం): విద్యార్థుల్లో ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ స్ప్రింగ్ ఫీల్డ్స్ స్కూల్ కరస్పాండెంట్ తలారి ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవ్ వాడలో గల స్ప్రింగ్ ఫీల్డ్స్ స్కూల్‌లో మిల్లెట్స్ వాడకం పై అవగాహన సదస్సు అత్యంత ఉత్సాహభరితంగా విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మిల్లెట్స్ (చిరు ధాన్యాలు) ప్రాముఖ్యత, పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా నిర్వహించబడింది.


కార్యక్రమం ప్రారంభ ంలో మిల్లెట్స్ ప్రాధాన్యతపై అవగాహన ప్రసంగం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు మిల్లెట్స్‌తో తయారు చేసిన వివిధ వంటకాలను ప్రదర్శిస్తూ వాటి ప్రాముఖ్యతను తయారీ విధానాన్ని ప్రత్యేక ఎగ్జిబిషన్ ద్వారా అందరికీ వివరించారు. పాఠశాల యాజమాన్యం, ఉపా ధ్యాయులు విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ కార్యక్రమాన్ని విజయవం తంగా నిర్వహించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమం సంప్రదా య ఆహారపు అలవాట్లను ప్రోత్సహిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలికి మిల్లెట్స్ ప్రాముఖ్యతను తెలియజేశాయి.ఈ కార్యక్రమం విద్యార్థుల్లోనే కాక సమాజంలో కూడా మిల్లెట్స్ పై అవగాహన పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించింది. ఈ సదస్సులో విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఉచిత అంబలి పంపిణీని ప్రారంభించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, మార్చి 30 (ప్రజాగళం ప్రతినిధి) తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓ) జిల్లాశాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ప్రారంభించారు. వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు వీలుగా తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపడం అభినందనీయమని టీఎన్జీఓ సంఘాన్ని అభినందించారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీఓప్రతినిధులు కృషి చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని అన్నారు.కలెక్టరేట్ ఉద్యోగులతో పాటువివిధ పనుల కోసం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయానికి వచ్చే వారికి ప్రస్తుత వేసవిలో అంబలి కేంద్రం ఉపశమనాన్ని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకుడు గైని గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన ద్రోణవల్లి సతీష్



బాన్సువాడ, మార్చి 30, ప్రజాగళం..

బాన్సువాడ నియోజకవర్గం నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్పల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహపథకం కింద నిర్మించిన గృహాన్ని బీర్కూర్ మాజీ జెడ్పిటిసి సభ్యులు ద్రోణవల్లి సతీష్ సోమవారం ఘనంగా ప్రారం భించారు. ఈ కార్యక్రమంలోగ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ద్రోణవల్లి సతీష్ మాట్లాడు తూ,పేదల గృహ కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపా రు. ఇందిరమ్మ గృహ పథకం ద్వారా నిరుపేద కు టుంబాలకు సొంత ఇల్లు కల్పించడం జరుగుతుండటం ఆనందదాయ కమని పేర్కొ న్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తు న్నామని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథ కాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని, ఇల్లు లేని ప్రతి కుటుంబానికి గృహం కల్పించే దిశగా అధి కారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయా లని సూచించారు. అలాగే లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన ఈ గృహం ప్రారంభం కావడంతో లబ్ధిదారుల కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది.

# గ్రామ,వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, మార్చి 30( ప్రజా గళం ప్రతినిధి) ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 02వ తేదీన గ్రామ పంచాయతీలలో నిర్వహించనున్న గ్రామ సభలు, మున్సిపాలిటీలలో నిర్వహించనున్న వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి అనంతరం అధికారులకు పలు అంశాలపై కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ముందస్తుగానే గ్రామ/వార్డు సభల వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని, పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. గ్రామ సభలు నిర్వహించే ప్రదేశాలలో తగిన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 7.30 నుండి 10.30 గంటల లోపు సభలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సభలలో అవగాహన కల్పించడంతో పాటు, ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారులతో వారి అనుభవాలనుతెలియజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎలాంటి లోటుపాట్లకుతావులేకుండా గ్రామ/వార్డు సభల విజయవంతానికి కృషి చేయాలన్నారు.ఇదిలాఉండగా,పదవ తరగతి పరీక్షా కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ,తహసిల్దార్లకు కలెక్టర్ సూచించారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సాఫీగా జరిగేలా చొరవ చూపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయాగౌడ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వడదెబ్బపై అవగాహన హర్షించదగ్గ విషయం

## ఆరోగ్య చైతన్య వేదిక కరపత్రాలను ఆవిష్కరించిన డిఎం హెచ్ ఓ రాజశ్రీ.



నిజామాబాద్ వైద్య విభాగం మార్చి 30 (ప్రజాగళం): వడదెబ్బ బారిన పడకుండా ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడం హర్షించదగ్గ విషయమని డిఎంహెచ్ఓ రాజశ్రీ అన్నారు. ఆరోగ్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఇందూర్ మదర్ హుడ్ హాస్పిటల్ సహకారంతో వడదెబ్బపై ముద్రించిన కరపత్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ సోమవారం ఆవిష్కరించారు.

ఈసందర్భంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ ఆరోగ్య చైతన్య వేదిక సేవ సంస్థ ఆధ్వర్యంలో వడదెబ్బపై కరపత్రాలు వేయించి అవగాహన కలిగించడం హర్షించదగ్గ విషయం అన్నారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజారోగ్యంపై ప్రజల్లో స్వచ్ఛందంగా అవగాహన కలిగించడం సంతోషించదగ్గ విషయమని ,ఇదే స్ఫూర్తితో జిల్లాలో అనేక కార్యక్రమాల పై స్వచ్ఛందంగా అవగాహన కలిగించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య చైతన్య వేదిక స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకులు, రాష్ట్ర కన్వీనర్ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటేష్, నియోజకవర్గ కన్వీనర్లు నిజాంబాద్ రూరల్ వై. శంకర్, నిజామాబాద్ అర్బన్ వి .ప్రవీణ్ రెడ్డి, ఆరోగ్యచైతన్య వేదిక ప్రతినిధులు హెచ్ ఈ ఓ కరిపె రవీందర్, డిహెచ్ఈలు వేణుగోపాల్, సలీం, మనోహర్ పాల్గొన్నారు.

# ప్రజావాణికి 106 ఫిర్యాదులు

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి; కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, మార్చి 30( ప్రజాగళం ప్రతినిధి,) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 106 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో,అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయాగౌడ్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఏ.సీ.పీ మస్తాన్ అలీలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా,అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ముందస్తు అరెస్టులు..




బాన్సువాడ, మార్చి 30, ప్రజాగళం. తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న “ఛలో అసెంబ్లీ” ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో బాన్సువాడకు చెందిన మలి దశ ఉద్యమకారులను సోమవారం పట్టణ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యమ కారులు మాట్లాడుతూ, ఎన్ని కల సమయంలో ముఖ్య మం త్రి మేనిఫెస్టోలో ఉద్యమకారులకు 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం, రూ. 25,000 పెన్షన్, గుర్తింపు కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీ కార్డుల్లో కూడా ఈ అంశాలు పొందు పరిచినప్పటికీ, ఇందిరమ్మ రాజ్యం ఏర్పడి 27 నెలలు గడిచినా ఇప్పటికీ ఆ హామీలు అమలు కాలేదని విమర్శించా రు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిద్ధమయ్యామని తెలిపారు.

అయితే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని విరమించుకున్నామని పేర్కొ న్నారు. పోలీసులు ముందస్తు చర్యగా పట్టణంలోని ఉద్యమ కారులను అరెస్ట్ చేసి అనంతరం సొంత పూచీ కత్తుపై విడుదల చేశారు.ఈ అరెస్టులో ఉడుతగంగాధర్ గుప్తా, గంజివార్ చందు, కాల్వ శ్యామ్,ఎదుబల్లి కృష్ణ, భాస్కర్ గౌడ్, అగ్లావే దత్తు, పల్లికొండ సాయికుమార్, గంగారామ్ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలి


## ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రాంచందర్ ప్రభుత్వాన్ని కోరారు...




ఎడపల్లి,మార్చి 30: (ప్రజా గళం): వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో అరుగాలం కష్టిం చి పండించిన పంటలకు న్యాయం జరిగేలా వరి కొను గోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని ఎడపల్లి గ్రామ సర్పంచ్ కందగట్ల రాంచందర్(అన్నా సేట్)ప్రభు త్వాన్ని కోరారు.ఈ మేరకు సోమవారం సర్పంచ్ రాంచందర్ మాట్లాడుతూ..మహిళా సమాఖ్య అలాగే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా జరిగే కొనుగోలు కేంద్రాలు రైతులకు ఎలాంటి సమస్యలు తలె త్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన కోరారు.రైతులు కూడా అన్నమో రామచంద్ర అని దిక్కులు చూడకుండా అకాల వర్షాలు పడే సూచనలు ఉన్నాయని అన్నారు.కనుక రైతులు ఎలాంటి ఇబ్బందు లు పడకుండా మహిళా సమాఖ్య,ప్రాథమిక వ్యవసా య సహకార సంఘాలు తక్షణమే రైతుల యొక్క ఆవే ద నను అర్థం చేసుకొని వడ్లను తీసుకొని న్యాయం చేయాలని ఆయన రైతులను కోరారు.

# ఎస్ఎస్సీ స్పాట్ వాల్యుయేషన్ అమౌంట్ పెంచాలి

## : తపస్ జిల్లా అధ్యక్షుడు భోనేకర్ సంతోష్



బాన్సువాడ, మార్చి 30, ప్రజాగళం: ఏప్రిల్ 1 నుండి ప్రారంభం కానున్న ఎస్ఎస్సీ స్పాట్ వాల్యుయేషన్ నేపథ్యంలో ఉపాధ్యాయులకు ఇచ్చే పారితోషికాన్ని పెంచాలని తపస్ జిల్లా అధ్యక్షుడు భోనేకర్ సంతోష్ ప్రభుత్వాన్ని కోరారు. బాన్సువాడ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డారు.గత సంవత్సరానికి సంబంధించిన రాజ స్పాట్ వాల్యుయేషన్ అమౌంట్ ఇప్ప టికీ పలువురు ఉపాధ్యా యులకు చెల్లించలేదని, వెంటనే బకాయిలను విడుద ల చేయాలని డిమాండ్ చేశా రు. అలాగే ఈ సంవత్సరంలో నిర్వహించనున్న స్పాట్ వాల్యుయేషన్ పనులకు తగిన విధంగా పారితోషికాన్ని పెంచాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యా వ్యవస్థకు మూలస్తంభాలుగా నిలుస్తారని, వారి శ్రమకు తగిన గౌరవం మరియు ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు. కొత్తగా అమలు చేస్తున్న నూతన విద్యా విధానాన్ని సమర్థవం తంగా అమలు చేయడంతోపాటు ప్రతి ప్రాథమిక పాఠ శాలలో ప్రీ-ప్రైమరీ తరగతు లను ప్రారం భించేందుకు చర్య లుతీసుకోవాలనిసూచించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధానకార్యదర్శి సత్యనారా యణ, ఉపాధ్యక్షులు వేద ప్రకాష్, నరసింహచారి, మహే ష్, కిష్టయ్య, సాయిలు, శ్రీని వాస్, స్వామి తదితర ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రైతులకు కలిసి రాని కాలం

పంట పండించే రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. విత్తనాలు మొదలుకుని, యూరియా, ఇతర క్రిమి సంహారక మందులు ఇలాఅనేక చోట్ల దగాపడుతూనే ఉన్నాడు. కాలం కలిసి వస్తే గిట్టుబాటు ధరల సమస్. కాలం కసలి రాకపోతే పంటలు ఎండిపోవడంతో వచ్చే కష్టాలు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతల విషయంలో ఎందుకనో స్పష్టమైన విధానంలో ముందుకు రావడం లేదు. రైతుభరోసా పేరుతో బురిడీ కొట్టించడం తప్ప సకాలంలో ఎరువులు విత్తనాలు సరఫరా చేయడం లేదు. యూరియా కష్టాలు తీరడం లేదు. పంటలను సకాలంలో కొనడం లేదు. కొన్నా గిట్టుబాటు ధరలు చెట్టించడం లేదు. ఈ సమస్యలు ఎవరు అధికారంలోకి వచ్చినా తీరడం లేదు. 2025 సంవత్సరంలో రైతులకు పెద్దగా లాభం దక్కలేదు. కష్టపడ్డా గిట్టుబాటు ధరలు దక్కలేదు. అన్ని పంటలకు ఇదే సమస్య ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ సమస్యల కారరణంగా రైతులు ఏటా చిత్తవుతున్నారు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రైతులను, నిపుణులను కూర్చోబెట్టి చర్చించడం లేదు. ఈయేడు పత్తి, మిర్చి, వరి పంటలను అధిక వర్షాలు దెబ్బతీసాయి. వచ్చిన పంటలను అమ్ముకుందామంటే గిట్టుబాటు ధరలు రావడం లేదు. రకరరకాల కారణాలతో గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదు. పత్తిరైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గిందంటే ధరల్లో కోత విధించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదట్లో సీసీఐకి పత్తిని విక్రయించిన చాలామంది రైతులకు మద్దతు ధర లభించలేదు. తేమ పేరిట ధర తగ్గించడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కొద్దిమంది నిల్వచేసుకుని ఇప్పుడు అమ్ముకుందామంటే సీసీఐ కోత విధించడంతో పాటు పత్తి బీబీ స్పెషల్ నుంచి మెక్‌మోడ్ కుమారిందని నెల వ్యవధిలో రూ.100కు పైగా కోత విధించారు. అయినా మద్దతు ధరకు రూ.100 నుంచి రూ.200 వరకు తగ్గించి కొనుగోళ్లు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వానలతో ఇబ్బందులు పడి పంటను సరైన ధర వచ్చే వరకు చూసి విక్రయిద్దామంటే ఇప్పుడు నాణ్యత పేరుతో కోతలు విధిస్తున్నారని, ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టకుండా పంటను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏటా పత్తి రైతుకు సీజన్ ఆరంభం నుంచి తిప్పలు తప్పడం లేదు. ప్రతికూల పరిస్థితుల్లో చేతికి వచ్చిన కొద్దిపాటి పత్తిని అమ్ముకునేందుకు కష్టాలు పడాల్సివస్తోంది. మొదట్లో తేమ పేరుతో మద్దతు ధర దక్కలేదు, ఇప్పుడేమో నాణ్యత లేదంటూ సీసీఐ ధరల్లో కోత విధించడంతో రైతులు నష్టపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో రూ.100కు పైగా కోత పెట్టడంపై పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ రూ.8,010 మద్దతు ధర ఇస్తుండగా, గరిష్టంగా రూ.7,800 తో మాత్రమే పత్తి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఉభయ రాష్ట్రాల్లో వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేపట్టారు. జిల్లా కేంద్రంలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది. పత్తిలో తేమ సంగతి పక్కన పెడితే పత్తిలో నాణ్యతాప్రమాణాలు తగ్గుతున్నాయని తొలుత రూ.50 కోత పెట్టి రూ.8,060 ధరతో కొనుగోళ్లు చేపట్టారు. మళ్లీ మరోమారు రూ.50 కోతపెట్టింది. ప్రస్తుతం పత్తిలో 8 శాతం తేమ ఉంటే రూ.8,010 మద్దతు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా, గరిష్టంగా రూ.7,800 ధర మాత్రమే పెడుతున్నట్లుగా రైతులు చెబుతున్నారు. సీసీఐ నిబంధనలతో విసుగు చెందిన రైతులు నగదు ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు రూ.7 వేలకే విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు తక్కువ ధరలను చూపి పత్తి కొనుగోలు చేస్తూ రైతులను ముంచుతున్నారు. సీసీఐ నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారడంతో దిక్కుతోచని స్థితుల్లో గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన వ్యాపారులు కపాస్ యాప్‌లో బుక్ చేసుకుని రైతుల పేరిట భూమి కాగితాలు, ఆధార్ చూపించి లాభాలు పొందుతున్నారు. వ్యాపారులకు కొనుగోలు సెంటర్ల వద్ద కొంతమంది ఆఫీసర్లు కొమ్ముకాస్తున్నారనే విమర్శలున్నాయి. సీసీఐ తీరుతో రైతులు నష్టపోతుండగా, రైతుల నుంచి కొనుగోలు చేసి వ్యాపారం చేసే దళారులు బాగుపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆంధ్రాలో 2025 సంవత్సరం మొత్తంలో రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర కాదు కదా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా రాలేదు. మిర్చి ధర సగానికి పడిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన వ్యత్యాస ధర పథకం ఏమైందో తెలియదు. పొగాకు లెటర్ ఇచ్చిన కంపెనీలు పొగాకు కొనకుండా ఎగనామం పెట్టారు. ప్రభుత్వం 6 వేలకు, 9 వేలకు కొనిపిస్తానని కేంద్రాలు తెరిచింది. ప్రభుత్వం ప్రకటించిన ధర 10 శాతం మందికి కూడా రాలేదు. అత్యధిక భాగం 3 వేలకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇంకా రైతుల దగ్గర పొగాకు ఉండిపోయింది. ఉల్లి రైతుకు కిలోకు రూపాయి కూడా రాని సందర్భాలు ఉన్నాయి, పారబోసిన సందర్భాలు ఉన్నాయి, పశువులను మేపిన సందర్భాలు ఉన్నాయి. హెక్టారుకు 50 వేలు ఎవరికి ఇచ్చారో, ఎందరికి ఇచ్చారో తెలియదు. మామిడి రైతులకు కిలో 12 రూపాయలకు కొనాలని, 4 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ముదరా ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ముదరా 190 కోట్లు తీసుకున్న ఫ్యాక్టరీలు కుమ్మక్కై కిలో రూ.3 నుండి రూ.6 మధ్యనే కోనుగోలు చేశాయి. రైతులు రోడ్లపై పారబోయడం, చెట్లను నరికి వేయడం చూశాం. కోకో రైతులకు 11.84 కోట్ల రూపాయలు ఇచ్చారు. సగం మంది రైతులకే అందాయి. ముందుగా అమ్ముకున్న రైతులు ఉసూరుమన్నారు. పత్తి సిసిఐ కొనుగోలు కేంద్రాలు పెట్టినా ప్రైవేట్ వ్యాపారుల పెత్తనమే సాగింది. క్వింటాలు రూ.7710 మద్దతు ధర కాగా, రైతులు రూ.5000 నుండి రూ.600 0 మధ్యనే అమ్ముకుంటున్నారు. టమోటా రైతులు పశువులు మేపుకున్న పరిస్థితి చూశాం. పప్పుసెనగ, మొక్కజొన్న అయినకాడికి అమ్ముకోవడం తప్ప ప్రభుత్వం ఆదుకున్నది లేదు. అరటికాయలు మార్కెట్‌కు తెచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని తోటలలో వదిలివేయడం, పశువులను మేపడం చూశాం. రైతులు కోల్పోయింది వేల కోట్లు, ప్రభుత్వం చెల్లించింది 201 కోట్లుగా తేలింది.

**- కొక్కు రవికుమార్**

# మితవాద ప్రభుత్వాలు 'పనిహక్కు'ను ఎందుకు వ్యతిరేకిస్తాయి..?



ప్రపంచంలోనే అతిపెద్ద డిమాండ్ ఆధారిత ఉపాధి హామీ చట్టాన్ని (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం) రద్దు చెయ్యడం అంటే శ్రమను గౌరవిస్తూ రాజ్యం హక్కుగా కల్పించిన సంక్షేమాన్ని నీరుగార్చి, భూస్వామ్యం దయమీద ఆధారపడిన నిరంకుశ, వివక్షతకు తావిచ్చే మితవాద సంక్షేమ పథకాన్ని రుద్దడమే. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన 'విబిజి రామ్ జి' పథకం (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్–గ్రామీణ్) మరోసారి గ్రామీణ పేదలను 'పైవాడి' దయకు వదిలేసింది. 'ఉపాధి హక్కు' ప్రజాస్వామికంగా పేదలకు లభించిన హక్కుగా వారికి సాధికారత కల్పించడంతో పాటు భూస్వామ్య వర్గాలతో వాని బేరసారాల శక్తిని ఇనుమడింప చేసింది. అటువంటి ఉపాధి హామీ చట్టాన్ని ఉపసంహరించడం మూలంగా గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగం ప్రబలి, వేతనాలు దిగజారి, గ్రామీణ ప్రాంత ఆదాయాలు పడిపోతాయి. గ్రామీణ ప్రాంత నయాధనిక వర్గానికి కూలీల మార్కెట్ మీద పట్టు పెరిగి, మరింత దోపిడి సాగించే అవకాశాలు పెరుగుతాయి. ఉపాధి హామీ అమలులోకి వచ్చాక పనికి చెల్లించే వేతనాల కన్నా శ్రామికుల మార్కెట్‌కి గిరాకీ పెరగడం మూలంగా పరోక్షంగా గ్రామీణ ప్రాంత పేదల ఆదాయాలు పెరిగాయని వివిధ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే గత కొన్నేళ్లుగా మోడీ ప్రభుత్వం ఉపాధి హామీకి నిధుల కేటాయింపుల్లో కోతవిధిస్తూ దానిని నీరుగార్చే ప్రయత్నాలు కొనసాగిస్తూ వచ్చింది. చివరికి పార్లమెంట్‌లో ఎలాంటిచర్చ లేకుండానే రద్దు చేసింది. గత కొన్నేళ్లుగా ఉపాధి హామీ అమలులో నిధుల దుర్వినియోగం జరుగుతూ ఉందని ఒక పథకం ప్రకారం నిధుల దుర్వినియోగం జరుగుతూ ఉందని ప్రచారం సాగించడం ద్వారా ప్రజానీకంలో ఈ పథకం అంతా అవినీతిమయం అనే అభిప్రా యం పాదుకొల్పడానికి గట్టి ప్రయత్నమే చేశారు. అయితే దీని అమలులో దుర్వినియోగాన్ని నివారించేందుకు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు హాజరు, చెల్లింపులను డిజిటలైజ్ చేశాయి. వాస్తవానికి నిధుల దుర్వినియోగం అనేది దీని కేటాయింపులతో పోలిస్తే అతి కనిష్ఠంగా ఉన్నాయి. దీనికి కూడా అవకాశం లేకుండా మరింత పారదర్శకంగా అమలు చేయడానికి తగిన చర్యలు చేపట్టాల్సిందిపో యి మోడీ ప్రభుత్వం ఏకంగా ఉపసంహరించింది. ప్రభుత్వం చేపట్టిన అనేక భారీ ప్రాజెక్టుల్లో ఉపాధి హామీ అమలులో జరిగిందని చెప్పుకొస్తున్న దుర్వినియోగానికి మించిన స్థాయిలో ఎన్నో రెట్లు అవినీతి, లంచాల చెల్లింపులు జరిగాయని ఇప్పటి వరకూ అనేక వార్తలు వెలువడ్డాయి. అలాంటప్పుడు ఉపాధి హామీని రద్దు చేసినట్లు ఈ ప్రాజెక్టులను రద్దు చెయ్యాలి కదా..! కానీఅలా జరగలేదు, జరగదు కూడా. ఎందుకంటే ఈ భారీ ప్రాజెక్టులలో జరిగే భారీ అవినీతి భాగోతాల్లో పాలకశక్తుల, సంపన్న వర్గాల పరస్పర ప్రయోజనాలు ఇమిడి ఉంటాయి. అదే పేదల విషయానికి వస్తే, అందులోనూ ఒక హక్కుగా ఉపాధి, దానికి తగ్గ వేతనం పొందడం విషయానికి వస్తేఏ కొద్ది పాటి దుర్వినియోగం అయినా ఏకంగా దాని రద్దుకే దారి తీస్తుంది. ఇక్కడ నిధుల దుర్వినియోగం కన్నా దీని మూలంగా శ్రమ దోపిడీ ఇష్టారాజ్యంగా సాగించుకోవడానికి అవకాశం లేకుండా పోవడమే కులీన శక్తులకు కంటగింపుగా మారింది.

బహుముఖ దాడి: ఉపాధి హామీ ఉపసంహరణ మూలంగా గ్రామీణ పేదలు బహుముఖ దాడికి గురవుతారు. ఒక హక్కుగా ఉపాధిపొందే అవకాశం కోల్పోతారు. తక్కువ కూలికి పనిలో కుదురుకోవాల్సి వస్తుంది. ఉపాధి పొందడంలో కులవివక్షకు, లింగ వివక్షకు లోనవుతారు. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామీణ భూస్వాములు, నయా ధనిక వర్గాల చెప్పుచేతల్లో నలిగి పోవాల్సి వస్తుంది. ఫ్యూడల్ రాజకీయ, ఆర్థిక ఆధిపత్యానికి తలొగ్గాల్సివస్తుంది. మోడీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'విబి జి రామ్‌జి' పథకం మూలంగా రాష్ట్ర ప్రభుత్వాల మీద విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల మూలంగా ఏటికేడాదికి రాష్ట్ర ప్రభుత్వాలకు అందాల్సిన నిధులు తగ్గిపోనున్నాయి. ఇలాంటి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు దీని అమలుకు అయ్యే ఖర్చులో 40శాతం వాటా భరించాల్సి రావడం అంటే అంత శక్తిలేని రాష్ట్రాలన్నింటా ఈ పథకం విస్తృతి కుంచించుకుపోతుంది. ప్రపంచంలోనే అతిపెద్ద డిమాండ్ ఆధారిత ఉపాధికల్పనా పథకం అమలు ద్వారా గ్రామీణ పేదలకు ఏటా కనీసం వందరోజులు పని కల్పించాల్సిన చట్టబద్ధమైన బాధ్యతను నిధుల లభ్యత సాకుగా చూపించి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు వదిలించుకుంటాయి. పైపెచ్చు కొత్త పథకంలో ఉపాధి హామీ పనులను కేంద్ర ప్రభుత్వం గుర్తించి 'నోటిఫై' చేసిన ప్రాంతాలలో మాత్రమే అమలు చెయ్యాలని పొందుపరిచిన నిబంధన మూలంగా ఈ సంక్షేమ పథకాన్ని కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే అది దాని రాజకీయ ప్రయోజనాలకు అనుగుణమైన సాధనంగా వాడుకుంటుంది. లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికవర్గం హక్కుల మీద దాడి చేసినట్లే జి రామ్‌జి పథకం ద్వారా గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల హక్కుల మీద మోడీ ప్రభుత్వం దాడికి దిగింది. ఉపాధి హామీ హక్కును లాగేసుకోవడం మూలంగా భూస్వాములు, గ్రామీణ సంపన్న వర్గాలు, కాంట్రాక్టర్లతో గ్రామీణ కార్మికుల బేరసారాలు ఆడే శక్తి బలహీన పడుతుంది. గ్రామీణ పేదలఆదాయాలు తగ్గుతాయి. నిరుద్యోగం ప్రబలుతుంది. దీని మూలంగా పట్టణాలకు వలసలు పెరుగుతాయి. వ్యవసాయేతర అసంఘటిత రంగంలోకి మరింత మంది వచ్చి చేరుతారు. దాంతో ఈ రంగంలో కూడా కార్మికుల బేరసారాల శక్తి తగ్గి వాని ఆదాయాలు పడిపోతాయి. వలస కార్మికులపై ఇష్టారాజ్యంగా దోపిడి కొనసాగుతుంది. ఉపాధి హామీలో స్థానిక అవసరాలకు అనుగుణంగా వివిధ ఆస్తుల నిర్మాణం చేపట్టే స్వతంత్రత, స్వేచ్ఛలను కొత్త పథకం హరించి వేస్తుంది. ఉపాధి హామీలో ఉన్న వికేంద్రీకరణ స్వభావం ఆవిరియిపోతుంది. కులం, లింగ వివక్షలకు తావు లేకుండా ఉపాధి పొందే గౌరవప్రదమైన హక్కుకు గ్రామీణపేదలు, కార్మికులు దూరమవుతారు. ఉపాధి హామీ ఉప సంహరణ మూలంగా గ్రామీణ భారతంలో తిరిగి ఫ్యూడల్ శక్తుల ప్రాబల్యం, ఆధిపత్యం జడలు విప్పుతుంది. భూస్వామ్య సమాజపు అవలక్షణాలన్నీ తిరిగి ప్రాణం పోసుకుంటాయి. హక్కులను ఒకసారి వెనక్కి తీసుకుంటే అది అధికార పొందికను హక్కుల అమలుకు ముందున్న పరిస్థితినే కాదు అంతకన్నా దారుణమైన పరిస్థితులకు దారితీస్తుంది. నిస్సహాయుల ఓటమిని వేడుకగా జరుపుకుంటుంది. పేదల తలరాత ధనవంతులు, బలవంతుల చేతుల్లో ఉంటుందన్న అప్రకటిత సామాజిక నియమాన్ని సమాజం మీద రుద్దుతుంది. దీని మూలంగా దోపిడికి గురవుతున్న వారిని, అణగారిన ప్రజానీకాన్ని సంఘటితం చెయ్యడం దుర్లభంగా మారుతుంది. ఇది గ్రామీణ పేదల వర్గబలం మీద దాడి చెయ్యడం మినహా మరొకటి కాదు. మితవాద ప్రభుత్వాలు తమ విచక్షణాధికారంతో సాయం అందించాలన్నదే విధానం తప్ప ప్రజలకు హక్కుగా అందించాలని భావించవు. ప్రత్యేకించి డిమాండ్ యాజమాన్య నిర్వహణలో భాగంగా ఉపాధి కల్పనలో రాజ్యం జోక్యం చేసుకోవడం తగదనేది ఉదారవాద విధానాల్లో ముఖ్యాంశం. ఈ నేపథ్యం నుంచి పరిశీలిస్తే ఉపాధి హామీకి చాలా ప్రత్యేకతలు, విశిష్టతలున్నాయి. ఇది వికేంద్రీకరించబడిన, గ్రామీణ పేదలకు హక్కులు కల్పించే, పనికల్పించ మని డిమాండ్ చేసే గ్రామీణ పేదలకు ప్రభుత్వం పూచీ పడాల్సిన చట్టాన్ని విబిడి రామ్‌జి పథకం పేరిట ఒక్క కలం పోటుతో నేల కూల్చేశారు.

## సెంటినరీ కాలనీ లయన్స్ క్లబ్ 11 అవార్డులు




కమాన్ పూర్ : రామగిరి మండలంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీకి 11 అవార్డులు వచ్చినట్లు క్లబ్ సభ్యులు, దాతల సహకారంతోనే ఈ విజయం సాధించినట్లు అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్ తెలిపారు. లయన్స్ ఇంటర్నేషనల్ రీజియన్--8 ఆధ్వర్యంలో బొంతకుంటపల్లి లోని ఫోటో ఫామ్ – విజయ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి హోస్ట్ క్లబ్‌గా రీజియన్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రీజియన్ చైర్‌పర్సన్ లయన్ రేకులపల్లి శశాంక అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సంద్ర సుధీర్ "ఆర్ట్ ఆఫ్ పేరెంటింగు అంశంపై లయన్స్ కుటుంబాలు మరియు పిల్లల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించి, పిల్లలను ఇతరులతో పోల్చకూడదని, విలువలు నేర్పాలని, భోజనం సమయంలో టీవీ చూడకూడదని, బెడ్‌రూమ్‌లో సెల్‌ఫోన్ వాడకూడదని సూచించారు. అనంతరం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ 114 సేవా కార్యక్రమాల ద్వారా సుమారు 7,000 మందికి సేవలు అందించి, రీజియన్‌లోని 7 క్లబ్బులలో రెండవ ఉత్తమ క్లబ్‌గా నిలిచి 2వ బెస్ట్ క్లబ్ ఆఫ్ ది రీజియన్ అవార్డు గెలుచుకుంది. క్లబ్ అధ్యక్షుడు లయన్ మేకల మారుతి యాదవ్‌కు ఉత్తమ అధ్యక్షుడు, కార్యదర్శి లయన్ అబ్బు కేశవ రెడ్డికి ఉత్తమ కార్యదర్శి అవార్డులు లభించాయి. క్లబ్‌కు మొత్తం 11కేటగిరీలలో అవార్డులు లభించాయి. వాటిలో ఉత్తమ అవసర ఆధారిత సేవా కార్యక్రమాలు, ఉత్తమ పర్యావరణ కార్యక్రమాలు, ఉత్తమ ప్రతిష్టా నిర్మాణ కార్యక్రమాలు మొదటి బహుమతులు కాగా, ఉత్తమ విజన్ కార్యక్రమాలు, ఉత్తమ బాల క్యాన్సర్‌సేవా కార్యక్రమాలు, ఉత్తమ లయన్స్ క్లబ్, ఉత్తమ క్లబ్ కార్యదర్శి రెండవ బహుమతులు సాధించాయి. అలాగే ఉత్తమ మధుమేహ శిబిరం, యువజన కార్యక్రమాలు, ఉత్తమ క్లబ్ అధ్యక్షు డు, ఉత్తమఆకలి నివారణ కార్యక్రమాలు మూడవ బహుమతులను ముఖ్య అధితి మోటివేషనల్ స్పీకర్ సంద్ర సుధీర్ రీజినల్ చైర్మన్ శశాంక, జోనల్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. అనంతరం క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ ఈ విజయానికి ప్రధాన కారణం క్లబ్ సభ్యులు, దాతల సహకారమేనని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల కోసం ముందుండి సేవలందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అబ్బు కేశవ రెడ్డి, డైరెక్టర్ గంట వెంకట రమణ రెడ్డి, గుండ శ్రీనివాస్, సభ్యులు మేకల గణేష్, బేరి కుమార్, జంగ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## 10 మినిట్స్ డెలివరీలు రద్దు

ముంబై: ఆన్‌లైన్ సర్వీస్‌లకు డిమాండ్ పెరుగుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది ఈకామర్స్ సంస్థలపైనే చాలా వరకు ఆధారపడుతున్నారు. దీంతో ఈకామర్స్ సంస్థలు కూడా కస్టమర్లకు మెరుగైన సేవలు అందిచేందుకు ఫోటీపడుతున్నాయి. ఈ క్రమంలో జెప్టో, బ్లింకిట్ వంటి సంస్థలు పది నిమిషాల్లో డెలివరీ సర్వీస్‌లు అందుబాటులోకి తెచ్చాయి. అయితే ఈ విధానంతో ఆయా సంస్థలో పనిచేసేగిగ్ వర్కర్లు ఇబ్బంది పడుతున్నారు. గిగ్ వర్కర్ల నిరసనల నేపథ్యంలో కేంద్రం క్విక్ కామర్స్ సంస్థలపై కొత్త ఆంక్షలు విధించింది. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ 10 నిమిషాల డెలివరీలను రద్దు చేయాలని ఆదేశించారు. బ్లింకిట్ వంటి ప్లాట్‌ఫామ్ లు యాడ్‌లలో ఈ టైమ్‌లైన్ చూపకూడదని స్పష్టం చేశారు. కొత్త సంవత్సరానికి ముందు డెలివరీ బాయ్స్‌లు తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. అధిక వేగ లక్ష్యాలు ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయని డిమాండ్ చేశారు. ఈ ఒత్తిడి కేంద్ర జోక్యం చేసుకుంది. 10నిమిషాల మోడల్ రద్దు సంస్థల వ్యాపార వ్యూహాలను మార్చనుంది. డెలివరీ సమయాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. కానీ వర్కర్ల భద్రత మెరుగుపడుతుంది. ఈ మార్పు ఇకామర్స్ రంగాన్ని ప్రభావితం చేస్తుంది. గ్రాహకులు సౌలభ్యం కోల్పోవచ్చు, సంస్థలు కొత్త మార్గాలు ఆవిష్కరించాలి. గిగ్ ఎకానమీలో కార్మిక హక్కులు బలపడుతాయి. డెలివరీ వేగాలకు భద్రతా మార్గదర్శకాలు రూపొందించాలి. వర్కర్లకు బీమా, శిక్షణ కార్యక్రమాలు అమలు చేయాలి. సంస్థలు బాధ్యతాయుత వ్యాపార మోడల్‌లకు మారాలి. మొత్తంగా గిగ్ వర్కర్లకు తాజా నిర్ణయం ఊరట దక్కింది. క్విక్ కామర్స్ సమస్థలు కూడా ఈమేరకు ప్రకటన చేశాయి. పది నిమిషాల డెలివరీని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాయి.

## 600 కుక్కలను చంపేశారు...

కామారెడ్డి: తెలంగాణను దిగ్భ్రాంతికి గురి చేసిన దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లాలోని మచ్చారెడ్డి మండల పరిధిలోని ఫరీద్‌పేట్, భవానిపేట్, వాడి, పలవంచ గ్రామాల్లో గత కొన్ని రోజులుగా 500 నుంచి 600 వరకు వీధి కుక్కలను విషం ఇచ్చి చంపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ సామూహిక హత్యలకు ఆయా గ్రామాలకు ఎన్నికైన సర్పంచ్‌లే కుట్రపన్నారని ఆరోపణలు ఉన్నాయి. 'గౌతమ్ స్ట్రే యానిమల్స్ ఫౌండేషన్' ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మచ్చారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో కుక్కల మృతదేహాలు ఒక్కసారిగా కనిపించడంతో కలకలం రేగింది. స్థానికుల కథనం ప్రకారం, ఇటీవల ఎన్నికైన సర్పంచ్‌లు ఎన్నికల సమయంలో వీధి కుక్కల సంఖ్య పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లో వాటి బెడదను తగ్గించడానికి ఈ "షార్ట్‌కట్"ను ఎంచుకున్నారు. ఆహారంలో విషం కలిపి లేదా విషపూరిత ఇంజెక్షన్ల ద్వారా మూగజీవాలను దారుణంగా చంపారని, అనంతరం ఆధారాలు లేకుండా రహస్యంగా వాటి మృతదేహాలను పూడ్చిపెట్టారని తెలుస్తోంది. వీధి కుక్కల సమస్యపై సుప్రీంకోర్టు ఇటీవల స్పందిస్తూ, కుక్కలను చంపాలని తాము ఆదేశించలేదని, 'పశువుల జనన నియంత్రణ' నిబంధనల ప్రకారం వాటిని నిర్వహించాలని చెప్పింది. అయితే, పశువుల క్రూరత్వ నిరోధక చట్టం, 1960 ప్రకారం కుక్కలను ఇలా చంపడం అనైతికం మాత్రమే కాదు, శిక్షార్హమైన నేరం కూడా. కామారెడ్డి పోలీసులు ప్రాథమిక విచారణ



ఆధారంగా సంబంధిత సర్పంచ్‌లు, వారి సహచరులపై భారతీయ న్యాయ స్మృతిలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జంతు ప్రేమికుల సంఘం 'స్ట్రే యానిమల్స్ ఫౌండేషన్ ఇండియా' ప్రతినిధులకు ఈ విషయం తెలిసింది. వారు ఆ ప్రాంతంలో తిరిగి సమాచారం సేకరించారు. స్థానిక ప్రజలతో మాట్లాడిన తర్వాత భయంకరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఫౌండేషన్ అధికారి గౌతమ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికైన ప్రతినిధులు చట్టాన్ని ఉల్లంఘించి ఈ నేరం చేశారని ఆయన ఆరోపించారు. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల దాడులకు సంబంధించిన వార్తలు వస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే, స్టెరిలైజేషన్, టీకాలు వంటి ప్రభుత్వ చర్యలు చేపట్టకుండా సామూహిక హత్యలకు పాల్పడటం అనేది దారుణమని, ఇది అధికార యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని నిపుణులు భావిస్తున్నారు.

## దేశంలో 4 ఏళ్లలో 3.3 లక్షల మంది దుర్మరణం

ముంబై: బైక్ యాక్సిడెంట్లు, దేశవ్యాప్తంగా పెరుగుతున్న రోడ్డు మరణాల పట్ల కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం.. 2019 నుంచి 2023 వరకు గత 5 ఏళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారిలో దాదాపు సగం మంది బైక్ ప్రయాణికులే కావడం గమనార్హం. ఈ పరిస్థితిని అరికట్టేందుకు ప్రభుత్వం 2026 నాటికి భారీ సంస్కరణలు, కొత్త చట్టాలను తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఈ 5 ఏళ్లలో మొత్తం 7.78 లక్షలకు పైగా రోడ్డు ప్రమాద మరణాలు చోటు చేసుకున్నాయి. ఇందులో ద్విచక్ర వాహన ప్రమాదాల్లో చనిపోయిన వారి సంఖ్య 3.35 లక్షలకు పైగా ఉండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. 2023లో బైక్ మరణాల శాతం 45 శాతం అంటే 77,539 మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.


ఇక రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న యువత 66 శాతం 18 నుంచి 34 ఏళ్ల వయస్సు వారు ఉన్నట్లు తేలింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ప్రకటించిన వివరాల ప్రకారం.. ఈ ఏడాదిలో రోడ్డు భద్రతపై విప్లవాత్మక మార్పులు రానున్నాయి. మోటారు వాహన చట్టానికి సుమారు 61 సవరణలతో కూడిన నూతన రోడ్డు భద్రతా బిల్లును 2026లో పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. 2026 జనవరి నుంచి అమ్ముడయ్యే అన్ని కొత్త ద్విచక్ర వాహనాలకు యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ తప్పనిసరి కానుంది. ప్రతి కొత్త బైక్ కొనుగోలుతో పాటు.. షోరూమ్ యజమానులు ఐఎస్ఐ గుర్తింపు పొందిన రెండు హెల్మెట్లను (రైడర్, పిలియన్ రైడర్ కోసం) ఉచితంగా లేదా వాహనం ధరలోనే భాగంగా అందించాల్సి ఉంటుంది.

# ఒడిశా గుహల్లో ఆదిమానవుల ఆనవాళ్లు...

**ఒడిశాలో 15,000 ఏళ్ల నాటి మానవ నివాస ఆనవాళ్లు వెలుగులోకి**
**రాతియుగం నాటి పనిముట్లు, అద్భుతమైన రాతి చిత్రాలు లభ్యం**
**హరప్పా నాగరికత కంటే ఇవి పురాతనమైనవని నిపుణుల అంచనా**
**సంబల్‌పుర్ జిల్లా గుహల్లో ఏఎస్ఐ చేపట్టిన తవ్వకాల్లో ఆవిష్కరణ**



ఢిల్లీ,: ఒడిశాలో భారత పురాతన చరిత్రకు సంబంధించిన అత్యంత కీలకమైన ఆనవాళ్లు బయటపడ్డాయి. సంబల్‌పుర్ జిల్లాలోని రైరాఖోల్ ప్రాంతంలో ఉన్న భీమ మండలి గుహల్లో దాదాపు 15,000 ఏళ్ల క్రితం ఆదిమానవుల నివసించినట్లు ఆధారాలు లభించాయి. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) చేపట్టిన తవ్వకాల్లో ఈ చారిత్రక సంపద వెలుగు చూసింది. పురావస్తు శాస్త్రవేత్తలు జరిపిన ఈ పరిశోధనల్లో, రాతి యుగానికి చెందిన పనిముట్లు, ఆయుధాలతో పాటు గుహల గోడలపై గీసిన అద్భుతమైన చిత్రాలు (రాక్ పెయింటింగ్స్) లభించాయి. ఈ ఆధారాలు సింధు లోయలోని హరప్పా, మొహెంజోదారో నాగరికతల కన్నా ఎంతో పురాతనమైనవి కావచ్చని నిపుణులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఆనవాళ్ల కచ్చితమైన వయస్సును నిర్ధారించేందుకు కార్బన్ డేటింగ్ పరీక్షల నిమిత్తం నమూనాలను పంపినట్లు అధికారులు వెల్లడించారు. గంగాధర్ మెహర్ యూనివర్సిటీ చరిత్ర విభాగం ప్రకారం, ఈ ప్రాంతంలో 45కు పైగా రాతి ఆవాసాలు ఉన్నాయి. వీటిలోని చిత్రాల్లో ఆదిమానవుల జీవనశైలి, వేట దృశ్యాలు, జంతువుల బొమ్మలు కనిపిస్తున్నాయి.



సహజసిద్ధమైన రంగులతో గీసిన ఈ చిత్రాలు నాటి మానవుల కళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. స్థానికులు ఈ గుహలను మహాభారత కాలం నాటివిగా నమ్ముతున్నప్పటికీ, శాస్త్రీయంగా ఇవి అంతకంటే ఎంతో ప్రాచీనమైనవని తేలింది. ఈ చారిత్రక ప్రదేశాన్ని జాతీయ వారసత్వ సంపదగా గుర్తించి, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని చరిత్రకారులు, స్థానికులు కోరుతున్నారు. ఈ తవ్వకాలతో భారత ఉపఖండంలోని ఆదిమానవ చరిత్రకు సంబంధించి మరిన్ని కొత్త విషయాలు తెలిసే అవకాశం ఉంది.

# ప్రయాగ్‌రాజ్‌లో 44 రోజుల పాటు మాఘ మేళా...

అలహాబాద్, : ప్రయాగ్‌రాజ్‌లో 44 రోజుల పాటు సాగే మాఘ మేళా మొదలైంది. 2025లో నిర్వహించిన మహా కుంభమేళాకు మన దేశ నలుమూలల నుంచే కాకుండా.. ప్రపంచ దేశాల నుంచి.. కోట్లాది మంది భక్తులు వచ్చారు. ఇప్పుడు మాఘ మేళాకు కూడా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో గతేడాది మహా కుంభమేళా జరగ్గా.. ప్రస్తుతం మరో మాఘ మేళా మొదలైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనంగా రికార్డుల్లోకి ఎక్కింది. అయితే ఈసారి అక్కడ మాఘ మేళా నిర్వహిస్తున్నారు. మొత్తం 44 రోజుల పాటు సాగే ఈ మాఘ మేళా.. పౌష పూర్ణిమ నుంచి మహాశివరాత్రి వరకు కొనసాగనుంది. ఈ ఉత్సవంలో కోట్లాది మంది భక్తులు సంగమ స్నానాలు ఆచరించనున్నారు. ఈ మాఘ మేళాకు విచ్చేసే భక్తుల కోసం యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత, రవాణా ఏర్పాట్లు చేసింది. కుంభమేళా స్థాయి ఆధ్యాత్మిక అనుభూతిని ప్రశాంతమైన వాతావరణంలో పొందాలనుకునే వారికి ఈ మేళా సరైన వేదిక అని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. పవిత్ర త్రివేణి సంగమం వద్ద మాఘ మేళా 2026 అట్టహాసంగా ప్రారంభమైంది. జనవరి 3వ తేదీన పౌష పూర్ణిమ పుణ్యస్నానంతో మొదలైన ఈ ఆధ్యాత్మిక ఉత్సవం ఫిబ్రవరి 15వ తేదీన మహాశివరాత్రి వరకు మొత్తం 44 రోజుల పాటు కొనసాగనుంది. కుంభమేళాతో పోలిస్తే తక్కువ రద్దీ.. ప్రశాంతమైన వాతావరణంలో భక్తి పారవశ్యాన్ని పొందేవారికి ఇది ఒక చక్కని అవకాశంగా మారనుంది. గతేడాది జరిగిన మహా కుంభమేళా రద్దీతో పోలిస్తే.. ఈ మాఘ మేళా భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. గంగ, యమున అంతర్వాహిని అ?న సరస్వతీ నదుల కలయిక అయిన త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానం ఆచరించడం వల్ల పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం.



మాఘ మేళా ప్రారంభ తొలి రోజు అయిన పౌష పూర్ణిమ నాడే సుమారు 21.5 లక్షల మంది భక్తులు సంగమ తీరంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఈ మేళాలో ఆరు ప్రధాన స్నాన దినాలు ఉన్నాయి. భక్తుల సౌకర్యార్థం 800 హెక్టార్ల మేళా ప్రాంతాన్ని 7 సెకార్లుగా విభజించారు. సుమారు 3800 ప్రత్యేక బస్సులు.. 42 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. ఈ మాఘ మేళాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 17 పోలీస్ స్టేషన్లు, 42అవుట్ పోస్టులు, 400 సీసీటీవీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచారు. మెడికల్ ఎమర్జెన్సీ కోసం మాఘ మేళా ప్రాంగణంలోనే రెండు 20 పడకల ఆస్పత్రుల ను నిర్మించారు. ప్రతీ 12 ఏళ్లకు ఒకసారి అత్యంత భారీ స్థాయిలో జరిగేది కుంభమేళా. అయితే ఈ మాఘ మేళా మాత్రం ప్రతీ సంవత్సరం నిర్వహిస్తారు. కుంభమేళాలో ఉండే సాధువుల సమాగమం, దానధర్మాలు, హారతులు, ఆధ్యాత్మిక చర్చలు అన్నీ మాఘ మేళాలోనూ ఉంటాయి. కానీ కుంభమేళాతో పోల్చితే.. మాఘ మేళాలో భక్తుల రద్దీ కొంత తక్కువగా ఉంటుంది.

# ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు!

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ శాసనసభలో నైతిక విలువల కమిటీ సమావేశం అయింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు సభా కార్యక్రమాలకు హాజరుకాకుండానే, అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలను పొందుతున్నారనే ఫిర్యాదులపై ఈ కమిటీ చర్చించింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ నిబంధనలను ధిక్కరిస్తూ, సభా కార్యక్రమాలకు గైర్హాజరవుతున్న ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేల తీరుపై ఎథిక్స్ కమిటీ సీరియస్ అయింది. శాసనసభ సమావేశాలకు రాకుం డా పార్టీ నిర్ణయం పేరుతో బయటే ఉంటున్న ఈ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఖజానా నుండి అందే జీతాలు, టీఏ , డీఏ లను మాత్రం క్రమంతప్ప కుండా తీసుకుంటున్నట్లు కమిటీ ప్రాథమికంగా గుర్తించింది. ప్రజాప్రతినిధులుగా ప్రజల గొంతుకను సభలో వినిపించాల్సిన బాధ్యతను విస్మరించి, కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం పదవులను వాడుకోవడం నైతికంగా నేరమని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. స్పీకర్ కూడా ఈ విషయంలో అత్యంత కఠినంగా



ఉండాలని భావిస్తున్నారు. సభకు రావడం అనేది ఎమ్మెల్యేల హక్కు మాత్రమే కాదు, అది వారి ప్రాథమిక బాధ్యత. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటూ సభను బహిష్కరించడం శాసనసభను అవమానించడమే అని స్పీకర్ కార్యాలయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం, స్పీకర్ అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరుకాకపోతే సదరు సభ్యత్వంపై అనర్హత వేటు వేసే అధికారం సభకు ఉంటుంది. అయితే, ఇప్పుడు జీతాల రికవరీ , ఇతర కఠిన చర్యల దిశగా అడుగులు పడుతున్నాయిశాసనసభ నిబంధనల ప్రకారం ఎథిక్స్ కమిటీ స్పీకర్‌కు సిఫారసులు చేసే అవకాశం ఉంది. సభకు హాజరుకాని రోజులకు సంబంధించిన జీతాన్ని, అలవెన్సులను నిలిపివేయడం లేదా రికవరీ చేయడం, నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి నిర్దిష్ట కాలం పాటు సభ నుండి సస్పెండ్ చేయడం, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, నిరంతరం గైర్హాజరవుతున్న వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని సభకు నివేదించడం చేయవచ్చు. ప్రస్తుతం ఈ వ్యవహారంలో ఆ ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి, వివరణ కోరాలని కమిటీ నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. వారిచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే వీరిపై కఠిన చర్యలు తీసుకునేలా స్పీకర్‌కు తుది నివేదిక సమర్పించనుంది. విపక్ష హోదా లేదన్న సాకుతో సభకు రాకుండా తప్పించుకుంటున్న ఎమ్మెల్యేలకు ఈ పరిణామం ఒక పెద్ద హెచ్చరికగా మారనుంది.

## టికెట్ ఛార్జీల నిర్ణయం 'వ్యాపార రహస్యం' : భారత రైల్వే



న్యూఢిల్లీ: రైలు టికెట్ ఛార్జీలను నిర్ణయించడానికి ప్రమాణాలను వెల్లడించలేమని భారత రైల్వే తెలిపింది. టికెట్ ఛార్జీలను లెక్కించే పద్ధతిరైల్వేల 'వ్యాపార రహస్యం' మరియు వాణిజ్య సమగ్రతకు సంబంధించిన విషయం అని రైల్వే బోర్డు కేంద్ర సమాచార కమిష న్‌కు తెలియజేసింది. ఛార్జీల నిర్ణయ వివరాలను కోరుతూ సమా చార హక్కు చట్టంకింద దాఖలు చేసిన దరఖాస్తును తిరస్కరించిన తర్వాత రైల్వే బోర్డుఈ వివరణ ఇచ్చింది. బేస్ ఫేర్‌ను లెక్కించే పద్ధతి, డైనమిక్ ధరమరియు టికెట్ ఛార్జీలు ఎలా ప్రభావితమ వుతాయి వంటి సమా చారాన్ని దరఖాస్తుదారుడు కోరాడు. అయితే, ఛార్జీల నిర్ణయ విధానాలు రైల్వేల మేధోసంపత్తి హక్కుల పరిధిలోకి వస్తాయని, సమాచార హక్కు చట్టం లోనిసెక్షన్ 8కింద మినహా యింపు పొందాయని రైల్వే వెల్లడిం చింది. రైల్వేలు వాణిజ్య సంస్థగా పనిచేస్తాయని, లాభాలను ప్రజా ప్రయోజనం కోసం ఉపయో గిస్తున్నందున, అటువంటి సమాచారాన్ని బహిర్గతం చేయడం ప్రజా ప్రయోజనానికి విరుద్ధమని రైల్వే బోర్డు పేర్కొంది.

## తెరపైకి కొత్త నేతలు

నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్ల సమయం దగ్గరపడుతున్న కొద్దీ కొందరు మంత్రుల్లో టెన్షన్ ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఇద్దరు మంత్రుల్లో టెన్షన్ ఎక్కువగా కనపడుతుంది. ఇద్దరు మంత్రులు ఇప్పుడు ఏవిషయంలోనూ వెనక్కు తగ్గడం లేదు. ఇప్పటివరకూ కొంత మౌనంగా ఉన్నప్పటికీ త్వరలో జరిగే మంత్రి వర్గ విస్తరణలో తమ పదవికి గండం ఏర్పడుతుందనుకున్నారో.. ఏమో.. ఈ ఇద్దరు మాత్రం తరచూ మీడియాలో కనిపిస్తున్నారు. ప్రధానంగా విపక్ష నేత వైఎస్ జగన్ పై విమర్శలు చేయడంలో వీరిద్దరూ ముందుంటున్నారు. నిన్న మొన్నటి వరకూ వంగలపూడి అనిత లేకుంటే.. నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు వంటి వారు మాత్రమే ఎక్కువ విమర్శలు చేసేవారు. ఇక నారాయణ సరేసరి. తాజాగా ఈ జాబితాలోకి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సవిత చేరిపోయారు. ఏవిషయంలోనూ వీరు వెనక్కు తగ్గకుండా తాము జగన్ ను విమర్శించడంలో ముందున్నామని చెప్పకనే చెబుతు న్నారు. నిన్న మొన్నటి వరకూ ఆయన శాఖపై మాత్రమే స్పందించేవారు. కానీ మంత్రివర్గ విస్తరణలో ఆనం ను త ప్పించి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కానీ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. మరొకవైపు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నుంచి ఆనంను తప్పించి వీరిలో ఒకరికి చంద్రబాబు కేబినెట్ లో స్థానంకల్పించే ఛాన్స్ ఉందన్న ప్రచారం తో ఆనం అలెర్ట్ అయినట్లు కనపడుతుందిఇక మరొక మంత్రి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సవిత కూడా ఈ మధ్య కాలంలోయాక్టివ్‌గా ఉన్నారు.

# అనకాపల్లిపై పట్టు కోసం...

విశాఖపట్టణం, : సీఎం రమేష్. తెలుగు స్టేట్స్‌లో పాపులర్ లీడర్. గతంలో టీడీపీలో ఉన్నా.. ఇప్పుడు బీజేపీలో ఉన్నా.. ఆయన స్టైలే వేరు. లాబీయింగ్ చేయడంలో ఆయన తర్వాతే ఎవరైనా అన్న పేరుంది. కడప జిల్లాకు చెందిన సీఎం రమేశ్ ప్రస్తుతం బీజేపీ తరుఫున అనకాపల్లి ఎంపీగా ఉన్నారు. గత ఎన్నికల వరకు సీఎం రమేశ్ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచింది లేదు. రాజ్యసభకు నామినేట్ అవుతూ పెద్దల సభకు వెళ్లే వారు. గత ఎన్నికల్లో అదును చూసి మరి.. కూటమి ఊపులో నామినేట్ పదవులకు స్వస్తి చెప్పి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. కడప జిల్లా నుంచి వచ్చి అనకాపల్లిలో ఎంపీ ఏంటీ.. అంటూ మొదట కొందరు విమర్శలు చేసినా, సీఎం రమేశ్‌కు వచ్చిన మెజార్టీ చూశాక అప్పట్లో అందరూ షాక్ అయ్యారట. ఫస్ట్ టైమ్ డైరెక్ట్ ఎలక్షన్స్‌లో ఎంపీగా పోటీ గెలిచిన.. సీఎం రమేశ్ తన పొలిటికల్ ఫ్యూచర్‌పై డెప్త్‌గా ఫోకస్ పెట్టారట. ప్రజలతో నిత్యం టచ్‌లో లేకపోతే లాంగ్ టర్మ్ పాలిటిక్స్ చేయడం కష్టమని భావించి అనకాపల్లి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారట. అనకాపల్లిని తన పర్మినెంట్ సీటుగా చేసుకునే ప్లాన్ చేస్తున్నారట. ఇకపై తన రాజకీయ క్షేత్రం అనకాపల్లే అంటూ అనుచరులకు సంకేతాలు ఇస్తున్నారట సీఎం రమేష్. చంద్రబాబుకు కుప్పం, జగన్‌కు పులివెందుల తరహాలో సీఎం రమేశ్ అంటే అనకాపల్లి అనేలా గ్రౌండ్ వర్క్ చేసుకుంటూ పోతున్నారట. తనకంటూ ఓ పర్మినెంట్‌గా ఓ సీటు లేకపోతే ఎన్నికలు వచ్చిన ప్రతీసారి నియోజకవర్గాన్ని వెతుక్కోవడం, అక్కడ అంతా సెట్ చేసుకోవడం కష్టమైన పని అని భావిస్తున్నారట. అందుకే అనకాపల్లి ప్రజల మనసును గెలచుకునేలా పనిచేసి.. తన సీటును పదిలం చేసుకోవాలని ప్లాన్ చేస్తున్నారట. సీఎం రమేశ్ అనకాపల్లిపై ఫోకస్ పెట్టడానికి రాజకీయ, సామాజిక, ఆర్థిక కారణాలు చాలానే ఉన్నాయన్న టాక్ వినిపిస్తోంది.

అనకాపల్లిలో బీసీ ఓటర్లు అత్యధికం. బీసీలు ఎవరి పక్షనా ఉంటే వారికే పట్టం. సీఎం రమేశ్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు



కూడా అధికంగానే ఉన్నాయి. టీడీపీకి అనకాపల్లి కంచుకోట. ఇక్కడైతే తనకు ఎలక్షన్ చేయడం చాలా ఈజీ అని సీఎం రమేశ్ భావిస్తున్నారట. అందుకే అనకాపల్లిని తన సొంత, శాశ్వత నియోజకవర్గంగా చేసుకునే ఎత్తుగడ వేస్తున్నారట. క్యాంప్ ఆఫీస్ పెట్టి నిత్యం ప్రజలకు తన తరుఫున.. అధికారులు, అనుచరులు అందుబాటులో ఉండేలా చూస్తున్నారట. తరుచూ నియోజవకర్గంలో పర్యటిస్తూ.. శుభకార్యాలు, పరామర్శలు ఉంటే నేరుగా సీఎం రమేశే హాజరవుతున్నారట. ఆయన అందుబా టులో లేకపోతే, తన సోదరుడు లేకపోతే కుమారుడు నియోజకవర్గ వ్యవహారాలు చూసుకుంటున్నారట.

అయితే అనకాపల్లి జిల్లాలో అర్సలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కు, డేటా సెంటర్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా ప్రాజెక్టులు రానున్నాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ అనుమతులుతో రావాల్సినవే.

ఈ ప్రాంతఅభివృద్ధికి తనవంతు చేస్తున్న కృషిని కూడా సీఎం రమేశ్ గట్టిగానే ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే అనకాపల్లి అంటేసీఎం రమేష్ అని గుర్తుకొచ్చేలా ఎత్తులు వేస్తున్నా రనే టాక్ ఇటీవల ఊపందుకుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికలప్పు డు లోకల్,నాన్ లోకల్ స్లోగన్ బలంగా వినిపిస్తుంటుం ది. ప్రత్యర్థులు,సొంత పార్టీలో ఉండే ఆశవాహులు వాడే లోకల్, నాన్ లోకల్ వెపన్‌ను సీఎం రమేష్ ఎలా ఫేస్ చేస్తారో చూడాలి.

# భారత్ చుట్టూ సమస్యలు!

ప్రపంచ రాజకీయాల్లో మార్పు సంకేతాలు కనిపించాయి. ప్రపంచం ఒక కొత్త అధ్యాయం దిశగా కదులుతున్నట్టు అనిపించింది. కొత్త నిర్మాణాన్ని రూపొందించే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్‌లో ఈ ఏడాది జరిగేఎన్నికలు ఆయా దేశాల అంతర్గత అంశాలు మాత్రమే కాదు. ఈ ఎన్నికలు దక్షిణాసియా స్థిరత్వం, భారత భద్రతా సమస్యలు, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలతో లోతుగా ముడిపడి ఉన్నాయి. మరోవైపు, యుక్రెయిన్– రష్యా యుద్ధం ఇకపై యూరప్‌కు మాత్రమే పరిమితమైన వివాదం కాదు. ఇది ప్రపంచ ఇంధన సరఫరాలు, ఆహార భద్రత, అంతర్జాతీయ నైతిక విలువలకు తీవ్ర మైన పరీక్షగా మారింది. భారత్ ఇప్పటివరకూ చర్చలు, సమన్వయ ం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి విధానాన్ని అనుస రిస్తోంది.

భారత్ స్పష్టంగా ఏదో ఓవైపు ఉండాల్సి వస్తుందా? భారత్ చాలా కాలంగా 'బహుళ ధ్రువ ప్రపంచ క్రమం' గురించి మాట్లాడుతోంది. అంటే అధికారం కొన్ని దేశాల చేతుల్లో మాత్రమే కేంద్రీకృతమై ఉండని ప్రపంచం. అయితే 'బహుళ ధ్రువ ప్రపంచం' అనేది ఒక ఆలోచన మాత్రమేనా, లేదా అది నిజంగా వాస్తవ రూపం దాల్చగలదా? ఈ చర్చలో భారత్ – చైనా సంబంధాలు కూడా కేంద్రబిందువ య్యాయి. ఒకవైపు, రెండు దేశాలు ఆర్థికపరంగా ఒకదానిమీద ఒకటి బాగా ఆధారపడి ఉన్నాయి.

మరోవైపు సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. వ్యూహాత్మక అపనమ్మకం పెరుగుతోంది. చర్చలకు మార్గాలు తెరిచే ఉన్నప్పటికీ, అదే సమయంలో అపనమ్మకం స్పష్టంగా ఉంది. భారత విదేశాంగ విధానం కూడా ఆర్థిక రంగంలో కొత్త దశలోకి ప్రవేశించింది. అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పం దాలు ప్రారంభమవుతున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాల్లో సవాళ్లు కొనసాగుతున్నాయి. గత ఏడాది ప్రారంభంలో, డోనల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన్ను కలిసిన మొదటి నలుగురు ప్రపంచ నాయకులలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఒకరు. ఈ సమావేశంలో మోదీని తన "గొప్ప స్నేహితుడు" అని ట్రంప్ అభివర్ణించారు. అయితే కొన్నినెలలుగా మోదీ, ట్రంప్ మధ్య సంబంధాలు ట్రంప్ మొదటి పదవీకాలంలో కనిపించినంతగా లేవు. ఈ మారుతున్న వాతావరణంలో ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై రెండు రకాల సుంకాలను విధించింది. ఒకటి వాణిజ్య కారణాలతో, ఇంకొకటి రష్యా నుంచి చమురు కొంటున్నం దుకు. భారత్‌పై అమెరికా మొత్తం 50 శాతం సుంకాలు విధించింది. ఆసియా దేశాలలో విధించిన అత్యధిక సుంకం ఇది.

ఆస్ట్రేలియాతో చర్చలు మంచిస్థాయిలో ఉన్నాయి. న్యూజీలాండ్, ఒమన్‌లతో ఒప్పం దాలు కుదిరాయి. యూకేతో యూరోపియన్ యూనియన్‌తో, ఆ తర్వాత అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే భారత్‌కు చాలా ఉపశమనం కలుగుతుంది..నేపాల్‌లో సార్వత్రిక ఎన్నికలు 2026 మార్చి 5న జరగనున్నాయి. బంగ్లాదేశ్‌లో 2026 ఫిబ్రవరి 12న ఎన్నికలు జరుగుతాయి. రెండూ భారత్‌కు పొరుగు దేశాలు, వ్యూహా త్మకంగా ముఖ్యమైనవిగా పరిగణిస్తారు. ఇటీవలి సంవత్సరాలలో, ఈ రెండు దేశాలతో భారత సంబంధాలు మునుపటిలా సజావుగా లేవు. మరి.. నేపాల్, బంగ్లాదేశ్‌లో ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వా లు ఏర్పడితే, భారత్ తన సంబంధాలను పునరుద్ధరించుకో వడానికి అవకా శం దక్కుతుందా? బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరిగిన సంఘటనలను పరిగణనలోకి తీసుకుంటే అక్కడి ఎన్నికలు భారత్‌కు చాలా ముఖ్యమైనవి" ఎన్నికల తర్వాత ఏ కొత్తప్రభుత్వం ఏర్పడినా, భారత్ దానితో సంబంధాలను బలోపేతంచేసుకోవడా నికి ప్రయత్నించాలని ఆయన భావిస్తున్నారు. షేక్ హసీనా ప్రభు త్వాన్ని ప్రస్తావిస్తూ, ఆ సమయంలో రెండు దేశాల మధ్య సంబంధాలు చాలా బలంగా ఉన్నాయన్నారు.

కానీ,భారత్ ఒక పెద్దవ్యూహాత్మక తప్పు చేసిందనే వాదన ఉంది, షేక్ హసీనా అధికారంలో ఉన్నప్పుడు సంబంధాలు చాలా బాగుండేవి. కానీ, బీఎన్‌పీ, ప్రతిపక్ష పార్టీలతో సంబంధాలకు ప్రయత్నించక పోవడం తప్పు. ఒకప్పుడు మనకు మంచి పొరుగు దేశం, మిత్రుడైన బంగ్లాదేశ్‌ను ఇపుడు మనం కోల్పోయాం. ఇప్పుడు తీసుకురావడం చాలాముఖ్యం" అనిఅన్నారు. భారత్ తన విదేశాంగ,వాణిజ్య విధానంలో వైవిధ్యాన్ని కొనసాగిం చాలని ఆమె సూచించారు. భారత్ అనేక దేశాలతో సంబంధాలను కొనసాగించాలి, ఏదేని విషయం కోసం ఒకే దేశంపై ఆధారపడ కుండా ఉండాలి. ఒకే దేశంపై ఆధారపడితే, అది సమస్యలను సృష్టించవచ్చు" అన్నారు అర్పితా ముఖర్జీ. భారత్ చాలాకాలంగా రష్యాతో మంచి సంబంధా న్ని కలిగి ఉంది. చైనాప్రపంచ సూపర్ పవర్‌గా మారుతోంది.

కీలకమైన ఖనిజాలు, ఆయుధాలలో దాని పాత్రను చాలా ఉంది, అమెరికా ఎజెండాను పరిశీలిస్తే, అది 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అంటే 'మాగా'. ఈ ఎజెండా కింద, అది దాదాపు అన్ని దేశాలపై సుంకాలను విధిం చింది" అమెరికా సుంకాలు విధించినప్పుడు, ఎవరు మిత్రుడు, ఎవరు శత్రువు అని చూడలేదు భారత్ ఎల్లప్పుడూ చైనాతో మంచి, బలమైన సంబంధాలను కొనసాగించాలి. వాణిజ్య సమతుల్యత మనకు వ్యతిరేకంగా ఉండటమే. ప్రస్తుత కాలంలో అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్‌తో వ్యవహరించడంలో ఏ దేశ విదేశాంగ విధానానికైనా పెద్ద పరీక్షే. 2023లోఅధ్యక్షుడు బైడెన్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని యూఎస్ పర్యటనకు ఆహ్వానించారు. చాలా తక్కువ మంది ప్రపంచ నాయకులకు దక్కిన గౌరవమది" అని ఆయన గుర్తుచేశారు. ప్రధాని మోదీ అయినా లేదా అధ్యక్షుడు షీజిన్‌పింగ్ అయినా, ప్రతి ఒక్కరికీ వారి సొంత అహం ఉంటుంది. కానీ,అతిపెద్ద అహం ట్రంప్. ఆ అహాన్ని ఎవరు డీల్ చేస్తారు, ఎలాచేస్తారనేది ప్రశ్న. బ్రిటన్ దీన్ని చేయగలిగింది.

# ఎస్బీఐలో 10.05 శాతం వడ్డీకే..!




మనకు ఎప్పుడు ఏ అవసరం పడుతుందో చెప్పలేం. పెళ్లి కోసమో లేదా వెకేషన్ కోసమో.. లేదా ఉన్నట్లుండి ఆస్పత్రిలో చేరాల్సి వస్తే ఖర్చులకు, ఇతర ఎమర్జెన్సీ అవసరాలకు డబ్బు కావాల్సి వస్తుంది.మన దగ్గర లేకపోతే బంధువులనో.. స్నేహితులనో అడుగుతుంటాం. అక్కడ దొరక్కపోతే ఇక బ్యాంకుల్లో లోన్ తీసుకోవడానికే చూస్తుంటామని చెప్పొచ్చు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు చాలా మంది చిన్న అవసరాల కూడా బ్యాంకుల్ని ఆశ్రయిస్తున్నారు.


ప్రాసెస్ కూడా ఒకప్పటితో పోలిస్తే వేగంగా జరుగుతుంది. పెద్దగా డాక్యుమెంటేషన్ పని లేకుండానే క్షణాల్లో అకౌంట్లో డబ్బులు జమ చేస్తున్నాయి. కొన్ని బ్యాంకులు ప్రీఅప్రూవ్డ్ లోన్స్ ఆఫర్ చేస్తూ.. బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే లోన్స్ అందిస్తున్నాయి.

కొంత కాలంగా ఆర్బీఐ కీలక రెపో రేట్లను తగ్గిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. గతేడాది ఏకంగా 125 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించగా.. బ్యాంకులు అందుకు అనుగుణంగా రెపో ఆధారిత వడ్డీ రేట్లను తగ్గించాయి. రెపోకు లింక్ అయి ఉన్న పర్సనల్ లోన్, హోం లోన్, వెహికిల్ లోన్ వంటి వాటి వడ్డీ రేట్లు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఎస్బీఐలో కూడా లోన్ వడ్డీ రేట్లు తగ్గాయి. గతంలో కంటే తక్కువ వడ్డీ రేటుకే ఇప్పుడు లోన్లు లభిస్తున్నాయని చెప్పొచ్చు. ఎస్బీఐలో పర్సనల్ లోన్ అనేది రెండేళ్ల టెన్యూర్ ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉంటుంది. ఈ బ్యాంకులో ఇప్పుడు పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు కనీసం 10.05 శాతం నుంచే ప్రారంభమవుతున్నాయి. గరిష్ఠ వడ్డీ రేటు 15.05 శాతంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, డిఫెన్స్, పారా మిలిటరీ, ఇండియన్ కోస్ట్ గార్డ్స్ సిబ్బందికి చాలా తక్కువ వడ్డీకే లోన్లు లభిస్తాయి. ఇంకా మెరుగైన సిబిల్ స్కోరు ఉన్న ప్రైవేట్ ఉద్యోగులకు కూడా కనీస వడ్డీ రేటుకే లోన్ లభించే అవకాశం ఉంటుంది.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ ప్రకారం.. రూ. 35 లక్షల వరకు పర్సనల్ లోన్ పొందొచ్చు. ప్రాసెసింగ్ ఫీజులు కూడా ఎక్కువేం ఉండవు. పెద్దగా డాక్యుమెంటేషన్ ఉండదు.

హిడెన్ కాస్ట్స్ ఏం లేవు. ఇప్పుడు మనం ప్రారంభ వడ్డీ రేటుతో అలాగే.. 11 శాతం, 12 శాతం వడ్డీ రేటుతో రూ. 5 లక్షల పర్సనల్ లోన్ తీసుకుంటే ఈఎంఐ ఎంత చెల్లించాలో చూద్దాం. రూ. 5 లక్షల లోన్ తీసుకుంటే.. మూడేళ్లకు 10.05 శాతం ప్రారంభ వడ్డీ రేటు చొప్పున నెలకు ఈఎంఐ రూ. 16,145 చొప్పున పడుతుంది. మొత్తం టెన్యూర్‌కు రూ. 81,232 వడ్డీ చెల్లించాల్సి వస్తుంది.

## దేశంలో ఎక్కువగా అమ్ముడవుతున్న కారు..



నవంబరులోనూ కార్ల విక్రయాలు పెరిగాయి. జీఎస్టీ తగ్గింపు జోష్ సహా పండగ ఆఫర్లు కలిసొచ్చాయి. కార్ల విక్రయాల్లో ఈ నెలకు సంబంధించి.. మారుతీ సుజుకీ ఇండియా టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఎగుమతులతో కలిపి నవంబర్ నెలలో ఏకంగా 2,29,021 యూనిట్లను విక్రయించడం విశేషం. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 26 శాతం వృద్ధి కనబరిచింది. స్మాల్ కార్ పోర్ట్‌ఫోలియోలో ప్రధానంగా ఉన్న ఎస్ ప్రెస్సో, ఆల్టో కే10, సెలెరియో, వ్యాగన్- ఆర్ వంటివి 37 శాతం వృద్ధి నమోదు చేశాయి. తర్వాత టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్.. 57,436 కార్ల విక్రయాలతో రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ కూడా 22 శాతం వృద్ధి కనిపించింది. మహీంద్రా అండ్ మహీంద్రా.. 56,336 కార్ల విక్రయాలు జరిపి మూడో స్థానంలో నిలిచింది. అయితే వీటన్నింటిలో అసలు ఏ కారు ఎక్కువగా అమ్ముడు పోయిందో మీకు తెలుసా.. అసలు జనం ఎక్కువగా ఏ కారు కొంటున్నారు.. ఏ కారు కోసం చూస్తున్నారు..

ఇలాంటిది తెలుసుకోవాలని మీకు ఆసక్తిగా ఉందా..? సాధారణంగా మారుతీ సుజుకీ నుంచి ఎక్కువ మోడల్స్, వేరియంట్స్ ఉంటాయి.. దేశంలో ఎక్కువ సేల్స్ ఆ కంపెనీ నుంచే ఉన్నాయని.. బెస్ట్ సెల్లర్ అదే కంపెనీ నుంచి ఉంటుందని అనుకుంటే మీరు పొరబడ్డట్లే. అవును.. టాప్ సెల్లర్ కారు టాటా గ్రూప్‌కు చెందిన టాటా మోటార్స్ నుంచి ఉంది. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్‌కు చెందిన టాటా నెక్సాన్ కాంపాక్ట్ ఎస్‌యూవీ.. దేశవ్యాప్తంగా నవంబర్ నెలలో అత్యధికంగా అమ్ముడుపోయిన కారుగా నిలిచింది. ఈ క్రమంలోనే మారుతీ సుజుకీ ఇండియా, హ్యుందాయ్ మోటార్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా.. ఇలా దిగ్గజ ప్రత్యర్థుల్ని తట్టుకొని ఈ ఘనత సాధించింది. ఓవరాల్‌గా ఇప్పటివరకు చూస్తే మారుతీ సుజుకీ ఆల్టో కారు అత్యధికంగా అమ్ముడుబోయింది.

నవంబర్ నెలలో టాటా మోటార్స్.. ఏకంగా 22,434 యూనిట్ల టాటా నెక్సాన్ కార్లను విక్రయించింది. ఇక్కడే మరో విశేషం ఏంటంటే.. ఒక్క నెల కాదు.. వరుసగా మూడో నెలా ఇండియాలో ఇదే టాప్‌లో నిలిచింది. అక్టోబర్‌లో 22,083 యూనిట్లు.. సెప్టెంబర్ నెలలో 22,573 యూనిట్లను విక్రయించింది. ఇలా వరుసగా 3 నెలల్లో 22 వేల మార్కును దాటింది. ఈ కారు విషయానికి వస్తే.. వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాల్లోనూ దేశంలో ఇదే టాప్‌లో ఉంది. 2021-22లో 1.24 లక్షల టాటా నెక్సాన్ కార్లను సేల్ చేసింది. 2022-23లో 1.72 లక్షలు, 2023-24లో 1.71 లక్షలు, 2024-25లో 1.63 లక్షల యూనిట్లను విక్రయించగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1.30 లక్షల కార్లను సేల్ చేసింది. టాటా నెక్సాన్ ఆన్ రోడ్ ప్రైస్ కనీసం రూ. 9 లక్షల నుంచి (బేస్ మోడల్).. గరిష్టంగా రూ. 18 లక్షల వరకు (టాప్ మోడల్) ఉంది.

## మళ్లీ షాకిచ్చిన బంగారం, వెండిభారీగా పెరిగిన రేట్లు



బంగారం వెండి ధరలు గడిచిన పదిరోజుల్లో భారీ హెచ్చుతగ్గులు నమోదు చేశాయి. బంగారం, వెండి ధరల పతనం కంటిన్యూ అవుతుందని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. కొనుగోలుదారులకు మళ్లీ షాకిచ్చాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.2240 పెరిగి రూ.1,58,840కి చేరింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.2050 పెరిగి రూ.1,45,600 వద్ద కొనసాగుతోంది. 18 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1680 పెరిగి రూ.1,19,130కి చేరింది.

## పీఎస్‌యూ బ్యాంకుల్లో ఎఫ్‌డీఐ పరిమితిని పెంచే ప్రతిపాదన లేదు




ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని ప్రస్తుత 20 శాతం నుంచి 49 శాతానికి పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మంగళవారం తెలిపారు.ప్రస్తుతం ఎఫ్‌డీఐ వాటా పరిమితి పీఎస్‌బీల్లో 20 శాతం, ప్రైవేట్ రంగ బ్యాంకులలో 74 శాతంగా ఉంది. ప్రైవేట్ రంగ బ్యాంకుల విషయంలో ఎఫ్‌డీఐ 49 శాతం వరకు ఆటోమేటిక్ రూట్ ద్వారా, 49 శాతం దాటి 74 శాతం వరకు ప్రభుత్వ అనుమతితో వర్తిస్తుంది. పీఎస్‌బీలలో ఎఫ్‌డీఐ పరిమితిని 49 శాతానికి పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించిందా లేదా అనే దానిపై రాజ్యసభలో అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా, పంకజ్ చౌదరి అలాంటి ఆలోచన లేదని సమాధానం ఇచ్చారు. అయితే, కేంద్ర ప్రభుత్వ వాటాల సంఖ్య తగ్గకపోయినా, బ్యాంకులు కొత్త షేర్లను జారీ చేయడం ద్వారా మూలధనాన్ని సేకరించడం కోసం ఈ బ్యాంకుల్లోని కొన్నింటిలో కేంద్ర ప్రభుత్వ వాటాల శాతం తగ్గిందని ఆయన తెలిపారు.

## గూగుల్ ఉద్యోగుల ఆగ్రహం




గూగుల్ సంస్థలో అంతర్గత అలజడి. అమెరికా ప్రభుత్వ విభాగాలైన హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ లతో గూగుల్ ఒప్పందాలను వ్యతిరేకిస్తూ దాదాపు వెయ్యి మంది ఉద్యోగులు పిటిషన్ దాఖలు చేశారు. గూగుల్ సాంకేతికత హింసకు, నిఘాకు, అణచివేతకు సాధనంగా మారుతోందని, ముఖ్యంగా క్లౌడ్, ఏఐ వినియోగం వలసదారులను ట్రాక్ చేయడానికి, సరిహద్దు నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విభాగాలతో ఉన్న అన్ని ఒప్పందాలను బహిర్గతం చేసి, తక్షణమే వాటి నుంచి గూగుల్ వైదొలగాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.కేవలం క్లౌడ్ సేవలే కాకుండా.. గూగుల్ జనరేటివ్ ఏఐ కూడా ప్రభుత్వ విభాగాల సామర్థ్యాన్ని పెంచేందుకు వాడటంపై వారు విస్మయం వ్యక్తం చేశారు.

## వెంకన్నస్వామితో పెట్టుకుంటే పుట్టగతులుండవు

### -ఏపీ కార్మికశాఖమంత్రి సుభాష్

అమరావతి, మహానది న్యూస్, ఫిబ్రవరి 21: భక్తుల మనోభావాలను వైఎస్సార్ సీపీ నాయకులు దెబ్బతీస్తున్నారని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. శ్రీవారిని రాజకీయ ఆయుధంగా వాడుకోవాలని వైఎస్సార్సీపీ చూడడం మహా పాపమని ఆయన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏడుకొండల వాడితో పెట్టుకుంటే పుట్టగతులుండవని సుభాష్ ధ్వజమెత్తారు. శ్రీవారి పేరుతో రాజకీయ లాభం పొందాలనుకునే వారిని దేవుడు క్షమించరు. శ్రీవారి ఫోటోలను పట్టుకుని కాళ్లకు బూట్లు, చెప్పులు వేసుకుని వైఎస్సార్సీపీ సభ్యులు దుర్మార్గానికి ఒడిగట్టారని మంత్రి పేర్కొన్నారు. శ్రీవారిభక్తులమనోభావాలను వైఎస్సార్సీపీ నేతలు పదే పదే దెబ్బతీస్తున్నారని దుయ్యబట్టారు.వైఎస్సార్సీపీ నేతలు ప్రజలు నేరుగా ఎన్నుకున్న శాసనసభ సమావేశాలకు మాత్రం రారని, అదే వారు రద్దు చేయాలనుకున్న శాసనమండలికి మాత్రం హాజరవుతూ వాటి సమావేశాలను అడ్డుకుంటారని సుభాష్ విమర్శించారు. అటు దేవుడన్నా, ఇటు ఎన్నుకున్న ప్రజలన్నా, వైఎస్సార్సీపీ నేతలకు లెక్కలేదని అన్నారు.హిందువుల మనోభావాలు, శ్రీవారి భక్తులమనోభావాలపై జగన్ రెడ్డి,వైఎస్సార్సీపీ నాయకులు ముప్పేట దాడులు చేయడాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఖండించారు.జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్?లో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు, షూలు వేసుకుని నినాదాలు చేస్తూ రాజకీయం చేసే నీచానికి దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూమత విశ్వాసాల పట్ల, తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయాలు, సంస్కృతి పట్ల జగన్మోహన్ రెడ్డికి ముందు నుంచీ చిన్నచూపు ఉందని, పరమపవిత్రమైన దేవుడి ప్రసాదాన్ని జంతు కొవ్వు, ప్రమాదకర రసాయనాలతో కల్తీ చేశారని మంత్రి సుభాష్ ఆరోపించారు.స్వార్థ రాజకీయాల కోసం దేవుణ్ణి వాడుకుంటే ప్రజలు ఉపేక్షించరన్నారు. ఏడుకొండల వాడితో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవని చరిత్ర చెప్తోందని ఆయన తెలిపారు.శ్రీవారి పేరుతో రాజకీయ లాభం పొందాలనుకునే వారిని ఆ దేవుడు ఎప్పటికీ క్షమించరని అన్నారు.

## బంగారం-వెండి ధరల్లో భారీ ఉద్ధృతి



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ బలహీనత, భూస్థిర రాజకీయ ఒత్తిళ్లతో కలిసి ఈ ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా వెండి ధర గత కొన్ని రోజులుగా అనూహ్యంగా ఎగసి, ఇప్పుడు చారిత్రాత్మక స్థాయికి చేరింది. ఇది పెట్టుబడిదారులను, నగల ప్రియులను ఆలోచనలో పడేస్తోంది. వెండి మార్కెట్‌లో అతి పెద్ద షాక్ నమోదైంది. ఒక్క కిలో సిల్వర్ ధర ఒక్క రోజులోనే రూ.5,000 పెరిగి రూ.2,01,000కు చేరింది. చాలా రోజుల తర్వాత వెండి కిలో రూ.2 లక్షల మార్కును దాటడం గమనార్హం. ఈ పెరుగుదలతో పారిశ్రామిక వినియోగం, పెట్టుబడి డిమాండ్ మరింత బలపడుతున్నట్టు కనిపిస్తోంది. బంగారం విషయంలోనూ పరిస్థితి భిన్నంగా లేదు. 24 క్యారెట్ ప్యూర్ గోల్డ్ 10 గ్రాముల ధర రూ.710 పెరిగి రూ.1,30,580కు చేరింది. అదే సమయంలో 22 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.650 ఎగసి రూ.1,19,700గా నమోదైంది. ఈ ధరలు పెళ్లిళ్ల సీజన్‌లో నగల కొనుగోళ్లను ప్రభావితం చేయబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే ధరలు అమలవుతున్నాయి. రాష్ట్రంలోని పలుచోట్ల బంగారం-వెండి షాపుల్లో కస్టమర్ల సందడి కొనసాగుతూనే ఉన్నా, ఈ భారీ పెరుగుదలతో కొందరు వేచి చూడాలని నిర్ణయించుకుంటున్నారు. రానున్న రోజుల్లో ధరలు మరింత ఎగసాయేదా లేక స్థిరపడతాయా అన్నది మార్కెట్ నిపుణులు గమనిస్తున్న ముఖ్య అంశం.

## చరిత్రలోనే తొలిసారిగా కుప్పకూలిన రూపాయి..

ముగింపు 89.96తో పోలిస్తే.. ఈరోజు భారత రూపాయి విలువ అమెరికా డాలర్‌తో పోలిస్తే 90.16కి పడిపోయింది. రూపాయి తొలిసారిగా 90 స్థాయిని దాటడం మార్కెట్‌లో ఆందోళన కలిగించడమే కాకుండా.. రాబోయే నెలల్లో ఆర్థిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉందనే సంకేతాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ఈ పతనం భారత కరెన్సీపై కొత్త ఒత్తిడిని సూచిస్తుండగా.. దిగుమతి ఖర్చులు, ఇంధన ధరలు, విదేశీ విద్య, ప్రయాణాల వంటి అనేక రంగాల్లో ప్రభావం తక్షణమే కనిపించనుంది. ఈ సంవత్సరం భారత రూపాయి అమెరికా డాలర్‌తో పోలిస్తే దాదాపు ఐదు శాతం క్షీణించింది.

# వేసవిలో ఆరోగ్యం కోసం







ఏడాది పొడవునా వివిధ కాలాల్లో పండ్లు, ఫలాలను ప్రకృతి మనకు అందించింది. వేసవిలో లభించే రకరకాల పండ్లు కూడా మనకెంతో మేలు చేస్తాయి. వాతావరణంలోని అధిక ఉష్ణోగ్రతలకు శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించటం, జీర్ణ సంబంధిత సమస్యల్ని దూరం చేయటం.. ఇలా పలు రకాలుగా ఇవి మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఈకాలంలో లభించే పండ్లు, పండ్ల రసాలు తీసుకుంటే ఎంతోకొంత ఉపశమనం పొందొచ్చు. పండ్లుగా తినటమే కాకుండా రసాలు (జ్యూసులు)గా కూడా వీటిని తీసుకుంటే చక్కటి ఆరోగ్యం సొంతమవుతుంది. బొప్పాయి, జామ, ఆపిల్, ద్రాక్ష, మామిడి, పుచ్చకాయ వంటివి మార్కెట్లో ప్రస్తుతం విరివిగా దొరుకుతున్నాయి. పండ్లలో బెటాకెరోటీన్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్-సి, పొటాషియం, విటమిన్-బి కలిగివుండటం వల్ల శరీరానికి కావాల్సిన వ్యాధి నిరోధక శక్తి సమకూరుతుంది. మంచి ఆరోగ్యానికి కూడా ఇవి దోహదపడతాయి. పుల్లని నిమ్మ, నారింజ పండ్లలో విటమిన్-సి అధికంగా ఉంటుంది. పండ్లుగానూ, జ్యూస్‌లుగానూ కూడా వీటిని తీసుకోవచ్చు. జ్యూస్ కన్నా పండ్లను నేరుగా తీసుకోవటం మంచిది. పండ్లలో ఎక్కువశాతం విటమిన్లు, మినరల్స్, ఫైబర్లు, ఫ్లావానోయిడ్స్ ఉంటాయి. జ్యూస్ చేసేటప్పుడు తొక్కను తీసేస్తుంటాం. అలాంటపవిడు వాటిలో ఉండే ఫైబర్, మినరల్స్, విటమిన్స్ తగ్గిపోతాయి. పండ్లలో యాంటీ ఆక్సిడెంట్స్, ఫాయిటో స్టేరోల్స్, ఫ్లావనోయిడ్స్ వంటివి శరీర ఆరోగ్యానికి కూడా దోహదపడతాయి. అదే జ్యూస్ అయితే ఈ ఫాయిటోకెమికల్స్ పండ్ల తొక్కలోనే ఉండిపోతాయి.

కొబ్బరి బోండాం: సమ్మర్‌లో మరో హెల్దీ డ్రింక్‌గా కొబ్బరి బోండాంను చెబు తుంటారు. వేసవి తాపాన్ని తట్టుకోవటానికి రోజుకు ఒక గ్లాస్ కొబ్బరినీటిని తీసుకుంటే మంచిది. దీనివల్ల అందులోని ఎలక్ట్రోలైట్స్ మన శరీరానికి అందుతాయి.

కివీ : పోషకాలు ఎక్కువగా నిక్షిప్తమే ఎండా కాలంలో లభ్యమయ్యే మరో పండు కివీ. ఇందులో అధికంగా ఉండే విటమిన్లు సి, ఇ, పొటాషియం, ఫైబర్ వంటివి శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించటంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి.

ఆప్రికాట్ : పొటాషియం, ఐరన్, బీటా కెరోటిన్,ఫైబర్‌తోపాటు విటమిన్ సి వంటి పోషకాలు అధికంగా లభించే మరో పండు ఆప్రికాట్. ఎండు ఆప్రికాట్ శరీరంలో ద్రవాల స్థాయిలు తగ్గకుండా చేయడంతోపాటుగా మలబద్దకం వంటి పలు జీర్ణ సంబంధిత సమస్యల్ని తగ్గించటంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. జ్వరం, రక్తహీనత, చర్మ సమస్యలు మొదలైనవి దరిచేరకుండా కాపాడుతుంది.

కర్బూజా : నీటిశాతం అధికంగా ఉండే పండ్లలో కర్బూజా ముఖ్యమైనవి. దీన్ని తినడం వల్ల ఇందులో ఎక్కువగా ఉండే నీరు శరీరంలోకి చేరి..చెమట రూపంలో కోల్పోయిన నీటిశాతాన్ని తిరిగి భర్తీ చేస్తుంది. ఈ పండు రక్తపోటుని అదుపులో ఉంచటంతోపాటు ఆస్తమా దరి చేరకుండా కాపాడటంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. చెరకు రసం చెరకును ముక్కలుగా కట్ చేసి నమలొచ్చు. మిషన్ ద్వారా చెరకు రసం కూడా తీసితాగొచ్చు. దీనినితీసుకోవటం వల్లతక్షణశక్తి లభిస్తుంది. వేడికారణంగా అలసిన శరీరానికి దీనివల్ల ఉపశమనం లభిస్తుంది. చెరకు రసాన్ని కూడా బెస్ట్ సమ్మర్ డ్రింక్‌గా చెబుతారు.

మ్యాంగో లస్సీ : ఇప్పుడిప్పుడే మామిడి పండ్లు మార్కెట్లోకి వచ్చేస్తున్నాయి.పండిన రసంకాయల నుంచి రసాన్నితీసి లస్సీలాకూడా తాగేయొచ్చు. ఇది నార్మల్ లస్సీ కంటే కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. పెరుగు కూడా కలుపుకోవచ్చు.ఈ రెండింటి కలయిక అద్భుతంగా ఉంటుంది.

అనాస : జీర్ణశక్తిని పెంచడానికి ఉపయోగపడే అద్భుతమైన పండు అనాస. వీటిలోఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ కారణం. ఎన్నో రకాల ఖనిజాలు, విటమిన్లు దాగున్నాయి. వీటిలో ఎక్కువమొత్తంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంపలు వ్యాధులబారినపడకుండా కాపాడతాయి. ఇవే కాకుండా బ్లూ బ్రెర్రీ, బ్లాక్ బెర్రీ, స్ట్రా బెర్రీ వంటి పండ్లలో ఫైటో కెమికల్స్ ఎక్కువ మొత్తంలో ఉంటాయి. ఇవి శరీరంలో రోగ నిరోధక శక్తిని మెరుగుపర్చడానికి తోడ్పడతాయి. శరీరంలో రక్త ప్రసరణ సరిగ్గా జరిగేలా చేయడంతోపాటు..క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలు రాకుండా నివారించడంలో కూడా సహాయపడతాయి.

పుచ్చకాయ వేసవిలో శరీరానికి ఉపశమనం కల్పించేవాటిలో పుచ్చకాయలు కూడా కీలకపాత్ర పోషిస్తాయి. ఇందులో నీటిశాతం చాలా ఎక్కువగా ఉంటుంది. దీనిని తినటం వల్ల డీహైడ్రేషన్ సమస్య తగ్గుతుంది. కాయను ముక్కలుగా చేసి తినొచ్చు. లేదా డ్రింక్‌గా తయారుచేసుకుని తాగొచ్చు. వేసవిలో దీనిని బెస్ట్ సమ్మర్ డ్రింక్‌గా పిలుస్తుంటారు. బీటా కెరోటిన్, పొటాషియం, ఐరన్ వంటి ఖనిజాలతో పాటు విటమిన్ సి కూడా ఈ పండులో సమృద్ధిగా ఉంటుంది. ఇవన్నీ శరీరం కోల్పోయిన నీటిని తిరిగి అందించటంలో సహాయపడతాయి.

పచ్చి మామిడి రసం : పచ్చిమామిడిని కూడా ముక్కలుగా కోసి తినొచ్చు. లేదా మిక్సీలో వేసి రసంలా చేసి తాగొచ్చు. ఇది కూడా వేసవి తాపాన్ని తగ్గించేసి శరీరానికి శక్తి నిస్తుంది. దీనివల్ల హైడ్రేట్‌గా కూడా ఉండొచ్చు. టిఫిన్ లేదా భోజనం ఒకవేళ ఆలస్యమైనా రోజంతా అలసట రాకుండా ఉంటుంది. ప్రస్తుతం చిన్నరసాలు, బంగినిపల్లి మామిడిపండ్లు మార్కెట్లోకి కోల్డ్ కాఫీ, టీ: చాలామంది ప్రతిరోజూ కాఫీ తాగుతుంటారు. ప్రతిసారీ హాట్ కాఫీ తాగేబదులుగా ఈ సీజన్‌కు తగ్గట్టుగా కోల్డ్ కాఫీ తాగటం కూడా మంచిదే. మనసు ప్రశాంతంగా హాయిగా ఉంటుంది. టీ కూడా అంతే. చల్లగా కూడా తీసుకోవచ్చు. పాలు లేకుండా డికాషన్‌లో నిమ్మరసం వేసి దానిని చల్లబరిచి తీసుకోవచ్చు. తద్వారా అలసట కూడా తగ్గుతుంది.

మామిడిపండ్లు వేసవిలో లభించే పండ్లలో అతి ముఖ్యమైనవి మామిడి పండ్లు. పెద్ద రసాలు, చిన్నరసాలు రసంతో అందరూ ఎంతో ఇష్టంగా తింటుంటారు. మామిడిలో ఎక్కువగా ఉండే విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి చాలా మంచిది. మామిడి పండ్లలో ఎక్కువగా ఉండే ఫైబర్, బీటా కెరోటిన్, విటమిన్ సి వంటి పోషకాలు ఆరోగ్యానికి చాలా అవసరం. ముంతమామిడి, తోతాపురి, హిమాపసంద్ వంటి పచ్చికాయలు కూడా ఆరోగ్యానికి బాగా మేలు చేస్తాయి.

లస్సీ : పెరుగుతో చేసిన లస్సీ కూడా మంచి రిఫ్రెషింగ్ డ్రింక్‌గా చెబుతారు. దీనిని తీసుకోవటం వల్ల శరీరం చల్లబడుతుంది. ఎంత వేడిగా ఉన్నా కాస్త లస్సీ తాగితే చాలా రిలాక్స్‌గా ఉంటుంది.

నిమ్మనీరు : ఎండాకాలంలో తప్పకుండా తాగాల్సిన నీరు నిమ్మరసం. ఈ రసాన్ని నీటిలో పిండి కొద్దిగా ఉప్పు, కొద్దిగా పంచదార వేసి షర్బత్‌లా తీసుకోవచ్చు. చక్కటి ఉపశమనం శరీరానికి వస్తుంది.

## ఎల్లప్పుడూ యంగ్‌గానే కనిపించాలా..?


సినిమా తారలను చూస్తే ఎల్లప్పుడూ వారు యంగ్‌గానే కనిపిస్తారు. 50 సంవత్సరాల వయస్సులోనూ యవ్వనంగానే కనిపిస్తారు. అయితే వారు అలా కనిపించేందుకు ఎంతో కష్టపడతారన్న విషయం మాత్రం చాలా మందికి తెలియదు. వారు సినిమాల్లో నటించాలి కనుక యంగ్‌గా ఉంటేనే బాగుంటుంది. కనుక ఆ ఫిజిక్‌ను మెయింటెయిన్ చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తుంటారు. వ్యాయామం చేయడంతోపాటు స్ట్రిక్ట్ డైట్‌ను కూడా పాటిస్తుంటారు. అయితే మన శరీరాన్ని యవ్వనంగా ఉంచడంలో ఆహారం ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. మనం తీసుకునే ఆహారాలే మన శరీనాన్ని యవ్వనంగా ఉంచుతాయి. అనారోగ్యాల బారిన పడకుండా చూస్తాయి. ఈ క్రమంలోనే నిత్యం పలు ఆహారాలను తినడం వల్ల ఎల్లప్పుడూ యంగ్ గా ఉండేలా చూసుకోవచ్చు. దీంతో అందరి దృష్టి మీపైనే పడుతుంది. ఇక అందుకు ఏయే ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం. రోజూ 2 నుంచి 3 కప్పుల గ్రీన్ టీని సేవిస్తుండడం వల్ల ఎల్లప్పుడూ చర్మాన్ని యవ్వనంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో పాలిఫినాల్స్ ఉంటాయి. ఇవి వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తాయి. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోయేలా చేస్తాయి. దీంతోపాటు తీవ్రమైన వ్యాధులు రాకుండా చూస్తాయి. కనుక గ్రీన్ టీని రోజూ తాగుతుంటే ఆరోగ్య ప్రయోజనాలు కలగడమే కాకుండా శరీరాన్ని ఎల్లప్పుడూ యవ్వనంగా ఉంచుకోవచ్చు. చర్మం కాంతివం తంగా మారి మెరుస్తుంది. అలాగే వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు చేపలను ఆహారంలో భాగం చేసుకోవాలి. సాల్మన్ వంటి చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, సెలీనియం, ఆస్టాజాం తిన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన శరీరంలో కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేసేందుకు దోహదపడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక చేపలను తరచూ తింటుండాలి.

**డార్క్ చాకొలెట్లు..:** డార్క్ చాకొలెట్లను తినడం వల్ల కూడా చర్మం ఎల్లప్పుడూ యవ్వనంగా ఉంటుంది. వీటిల్లో ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మాన్ని సంరక్షిస్తాయి. దీంతో చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. వృద్ధాప్య ఛాయలు అంత త్వరగా రావు. అవిసె గింజలలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఈ గింజల్లో ఆల్ఫా-లినోలీనిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మం పొరలను సంరక్షిస్తుంది. చర్మం ఎల్లప్పుడూ తేమగా ఉండేలా చేస్తుంది. దీంతో చర్మానికి సహజసిద్ధమైన నిగారింపు వస్తుంది. కనుక అవిసె గింజలను కూడా రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలి.

**దానిమ్మ పండ్లు..:** చూసేందుకు ఎరుపు రంగులో దానిమ్మ పండ్లు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఇవంటే చాలా మందికి ఇష్టమే. అయితే దానిమ్మ పండును రోజూ ఒకటి తింటున్నా చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి మరమ్మత్తులు చేస్తాయి. దీంతో చర్మ కణాలు పునరుత్తేజం చెందుతాయి. చర్మం యవ్వనంగా మారి కాంతివంతంగా కనిపిస్తుంది. రోజూ దానిమ్మ పండును తినడం ఇష్టం లేకపోతే దాని జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీంతో చర్మాన్నియంగ్‌గాఉంచుకోవచ్చు. అలాగే చెర్రీలను ఆహారంలో భాగం చేసుకున్నా కూడా చర్మం ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటుంది. చెర్రీ పండ్లలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తికి దోహదం చేస్తాయి. దీంతో చర్మం సురక్షితంగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తుంది.

# మామిడి ఆకులతో ఇంటి చిట్కాలు..

## ఎన్ని వ్యాధులను తగ్గించుకోవచ్చో తెలుసా..?



వేసవి కాలంలో మనకు మామిడి పండ్లు లభిస్తాయి. సీజనల్ ఫ్రూట్ అయిన ఈ పండ్లను వేసవి కాలంలో తింటే అనేక లాభాలను పొందవచ్చు. మామిడి పండ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవన్నీ మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మామిడి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గేందుకు దోహదం చేస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. గ్యాస్, అజీర్తి, అసిడిటీ, మలబద్దకం ఉన్నవారు మామిడి పండ్లను తింటుంటే ఫలితం ఉంటుంది. మామిడి పండ్లలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. అయితే కేవలం పండ్లే కాదు, మామిడి ఆకులు కూడా మనకు ఎన్నో లాభాలను అందిస్తాయి. ఆయుర్వేద ప్రకారం ఈ ఆకుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఇవి అనేక వ్యాధులను నయం చేసేందుకు దోహద పడతాయి.

**షుగర్ పూర్తిగా మాయం..:** డయాబెటిస్ ఉన్నవారికి మామిడి ఆకులను ఒక వరంగా చెప్పవచ్చు. 10 నుంచి 15 మామిడి ఆకులను తీసుకుని బాగా కడిగి ఒక పాత్రలోని నీటిలో వాటిని వేసి ఆ నీళ్లను బాగా మరిగించాలి. అనంతరం ఆ నీళ్లను చల్లార్చి రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటి రోజు ఉదయం ఆ నీటిని వడకట్టి పరగడుపునే అల్పాహారానికి 30 నిమిషాల ముందు తాగాలి. ఇలా రోజూ చేస్తుంటే కొద్ది రోజుల్లోనే ఫలితం కనిపిస్తుంది. షుగర్ లెవల్స్ పూర్తిగా అదుపులోకి వస్తాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. అయితే ఇలా నీళ్లను తయారు చేసేసదుపాయం లేనివారు మామిడి ఆకులను నీడలో ఎండబెట్టి పొడిగా చేసి దాన్నినిల్వ చేసుకోవాలి.ఈ పొడినిఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని ఒక గ్లాస్‌గోరు వెచ్చని నీటిలో కలిపి ఉదయం పరగడుపునే అల్పాహారానికి 30 నిమిషాల ముందు తాగాలి. షుగర్ మరీ ఎక్కువగా ఉన్నవారు రాత్రి పూట భోజనానికి ముందు కూడా ఈ నీళ్లను తాగాలి. ఇలా చేస్తున్నా కూడా షుగర్ అదుపులోకి వస్తుంది.

**చర్మ సమస్యలకు..:** మామిడి ఆకులను కొన్ని తీసుకుని నీడలో ఎండబెట్టాలి. ఆ ఆకులను పొడిగా చేయాలి. అనంతరం ఆ పొడిని పెనంపై వేయించి బూడిదలా మార్చాలి. అందులో కాస్త కొబ్బరినూనె కలిపి మెత్తని పేస్ట్‌లా మార్చాలి. ఈ మిశ్రమాన్ని రాస్తుంటే మొటిమలు తగ్గిపోతాయి. దీన్ని రాత్రి పూట మొటిమలపై రాసి మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. దీంతో మొటిమలు తగ్గుతాయి. ఈ మిశ్రమం గాయాలు, పుండ్లు మానేందుకు కూడా పనిచేస్తుంది. మామిడి ఆకులను నీటితో కలిపి మెత్తగా నూరి పేస్ట్‌లా చేయాలి. అందులో కాస్త పెరుగు కలిపి ఆ మిశ్రమాన్ని ఫేస్ ప్యాక్‌లా ముఖానికి రాయాలి. 15-20 నిమిషాలు ఆగిన తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా తరచూ చేస్తుంటే ముఖంపై ఉండే డల్ నెస్ తగ్గుతుంది. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. ముఖం అందంగా కనిపిస్తుంది.

**జుట్టు పెరిగేందుకు..:** మామిడి ఆకులను నీటితో కలిపి మెత్తగా నూరి పేస్ట్‌లా చేసి ఆ మిశ్రమంలో కాస్త ఆలివ్ ఆయిల్ కలపాలి. ఈ మిశ్రమాన్ని హెయిర్ ప్యాక్‌లా జుట్టుకు బాగా రాయాలి. 20 నిమిషాలు అయ్యాక తలస్నానం చేయాలి. తరచూ ఈ హెయిర్ ప్యాక్‌ను ఉపయోగిస్తుంటే శిరోజాలు కాంతివంతంగా మారి మెరుస్తాయి. జుట్టు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. చుండ్రు తగ్గిపోతుంది. మామిడి ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను మీరు స్నానం చేసే నీటిలో కలిపి ఆ నీటితో స్నానం చేయండి. దీంతో చర్మంపై ఉండే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ముఖ్యంగా దురద నుంచి ఉపశమనం లభిస్తుంది. మామిడి ఆకులను నీటితో కలిపి నూరి మెత్తని పేస్ట్‌లా చేసి అందులో కాస్త కొబ్బరినూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా మానుతాయి.

**ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి..:** మామిడి ఆకులను నీటిలో వేసి మరిగించి ఆనీటిలో కాస్త తేనె కలిపి తాగితే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభించి రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. మామిడి ఆకుల నుంచి రసం తీసి దాన్ని కొద్దిగా వేడి చేయాలి. ఆ రసాన్ని ఒకటి లేదా రెండు చుక్కల చొప్పున చెవిలో వేయాలి. దీంతో చెవి నొప్పి, చెవి ఇన్ఫెక్షన్ తగ్గుతాయి. మామిడి ఆకులను కాల్చగా వచ్చే పొగను పీలుస్తుంటే వెక్కిళ్లు తగ్గిపోతాయి. గొంతులో గరగర, మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. మామిడి ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను ఒక కప్పు మోతాదులో రోజూ తాగుతుంటే బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ మిశ్రమం ఎంతో మేలు చేస్తుంది. ఇలా మామిడి ఆకులతో అనేక చిట్కాలను పాటించి అనేక వ్యాధులను తగ్గించుకోవచ్చు. అయితే అలర్జీలు ఉన్నవారు మామిడి ఆకులను ఉపయోగించకూడదు.

# అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండాలని చూస్తున్నారా..?



ఆరోగ్యంగా ఉండేందుకు మనకు అనేక రకాల డైట్స్ అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ సౌకర్యానికి అనుగుణంగా ఉండే డైట్‌ను పాటిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఒక డైట్ మాత్రం బాగా ట్రెండింగ్‌లో ఉంది. అదే మైండ్ డైట్. రెండు రకాల డైట్‌లను కలిపి ఈ డైట్‌ను రూపొందించారు. మెడిటరేనియన్‌తోపాటు డ్యాష్ డైట్‌ను కలిపి మైండ్ డైట్‌ను రూపొందించారు. రష్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌కు చెందిన పరిశోధకులు ఈ డైట్‌కు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా పలు ఆహారాలను వారంలో నిర్దిష్టమైనన్ని సార్లు కచ్చితంగా తీసుకోవాలి. అలాగే కొన్ని ఆహారాలను తీసుకోవడం మానేయాలి. లేదా వారంలో చాలా తక్కువ సార్లు తీసుకోవాలి. ఇలా మైండ్ డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. దీంతో అనేక ప్రయోజనాలు పొందవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. **ఏం తినాలి..?:** మైండ్ డైట్‌లో బాగంగా వారంలో కనీసం 6 సార్లు కూరగాయలు, ఆకుకూరలను తినాలి, పిండి పదార్థాలు లేని కూరగాయలను ఏదో ఒకటి కచ్చితంగా రోజూ తినాలి. వారంలో కనీసం 2 సార్లు బెర్రీలను తినాలి. వారంలో కనీసం 5 సార్లు నట్స్‌ను తీసుకోవాలి. రోజూ ఆలివ్ ఆయిల్‌ను వంటలకు కచ్చితంగా ఉపయోగించాలి. ఓట్ మీల్, బ్రౌన్ రైస్‌ను వారంలో కనీసం 3 సార్లు తినాలి. వారానికి ఒకసారి చేపలను కచ్చితంగా తినాలి. వారంలో 3 సార్లు బీన్స్, వారానికి 2 సార్లు చికెన్ లేదా కోడిగుడ్లను, రోజుకు ఒక గ్లాస్ వైన్‌ను (వీలుంటే) తాగాలి. ఇలా మైండ్ డైట్‌లో భాగంగా ఈ ఆహారాలను కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది.

**ఏం తినకూడదు..?:** మైండ్ డైట్‌ను పాటించే వారు మటన్ తినకూడదు. లేదా వారంలో ఒకసారి తినవచ్చు. అంతకు మించరాదు. వెన్న, నెయ్యి రోజుకు ఒక టీస్పూన్ మించకూడదు. చీజ్‌ను వారంలో ఒకసారి మాత్రమే తినవచ్చు. పేస్ట్రీలు, స్వీట్లను కూడా వారంలో ఒకసారి మాత్రమే తినాలి. వేపుళ్లను కూడా వారంలో ఒకసారి మించి తినకూడదు. ఇక మైండ్ డైట్‌ను పాటిస్తే అనేక లాభాలను పొందవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. మైండ్ డైట్‌ను పాటించడం వల్ల అల్జీమర్స్ వచ్చే రిస్క్ చాలా వరకు తగ్గుతుందని చెబుతున్నారు. ముఖ్యంగా వయస్సు మీద పడిన వారిలో అల్జీమర్స్ అధికంగా వస్తుంది. కానీ మైండ్ డైట్‌ను పాటిస్తే అల్జీమర్స్ రాకుండా చూసుకోవచ్చు. అలాగే మెదడు యాక్టివ్‌గా మారి ఉత్తేజంగా పనిచేస్తుంది. బద్ధకం పోతుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. వృద్ధాప్యంలో మతిమరుపు కూడా రాకుండా అడ్డుకోవచ్చు. **లాభాలు..:** మైండ్ డైట్‌ను పాటిస్తే శరీరానికి అనేక విటమిన్లు, మినరల్స్ లభిస్తాయి. ముఖ్యంగా విటమిన్లు ఎ, కె, బి విటమిన్లు పొందవచ్చు. ఫోలేట్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా లభిస్తాయి. ఇవి మెదడును సంరక్షిస్తాయి. కణాలు వాపులకు గురి కాకుండా ఉంటాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. క్యాన్సర్, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. మైండ్ డైట్ వల్ల హృదయ సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి. మైండ్ డైట్‌ను పాటిస్తే తీవ్రమైన వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

# తంగేడు పువ్వు ఆరోగ్య ప్రయోజనాలు..



తంగేడు చెట్లు ఎక్కువగా కొండ ప్రాంతాలలో ఉంటాయి. ఈ చెట్టుకు ఉండే పసుపు రంగు పూలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ చెట్టులో ఔషధ గుణాలు మెండుగా ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని మెరుగుపరిచి అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉంచుతాయి. మరి ఈ చెట్టును ఏ విధంగా ఉపయోగిస్తే ఆరోగ్యానికి మంచి ఫలితాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. 1.మలబద్ధకం తగ్గుతుంది: తంగేడు ఆకుల పొడిని ఒక గ్లాసు గోరువెచ్చట నీటితో కలిపి ఉదయాన్నే తీసుకుంటే పేగులలో పేరుకుపోయిన మలం తేలికపడి మలవిసర్జన సాఫీగా జరుగుతుంది. కనుక మలబద్ధక సమస్యలతో బాధపడేవారు తంగేడు ఆకుల కషాయాన్ని తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. 2.అతిమూత్ర వ్యాధి సమస్యలు తగ్గుతాయి: కొందరిలో మూత్రం అధికంగా పోతుంటుంది. ఈ సమస్యను తగ్గించుకోవడానికి తంగేడు పూల పొడి బెల్లాన్ని సమాన భాగాలుగా తీసుకుని చూర్ణం తయారు చేసుకోవాలి. ఈ చూర్ణాన్ని ప్రతిరోజు సగం స్పూన్ చొప్పున తీసుకుంటే అతిమూత్ర వ్యాధి సమస్యలు తగ్గుతాయి. 3.నీళ్ల విరోచనాలు తగ్గుతాయి: ఒక గిన్నెలో రెండు గ్లాసుల నీళ్లు, తంగేడు చెట్టు వేర్లను వేసి బాగా మరిగించాలి. నీళ్లు బాగా మరిగిన తరువాత స్టవ్ ఆఫ్ చేసుకుని వడగట్టుకుని గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగాలి. ఇలా ఈ చెట్టు వేర్లతో చేసుకునే కషాయం నీళ్ల విరోచనాలను తగ్గించడానికి చక్కగా పనిచేస్తుంది. 4.మధుమేహం అదుపులో ఉంటుంది: తంగేడు పూల కషాయం మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. ఇందుకోసం ఒక గిన్నెలో రెండు గ్లాసుల నీళ్లు, తంగేడు పువ్వులు ఒక స్పూన్ నల్ల వక్కల పొడి వేసి బాగా మరిగించాలి. ఈ నీటిని వడగట్టుకుని తాగాలి. ఇలా క్రమం తప్పకుండా నెల రోజుల పాటు తాగితే మధుమేహం అదుపులో ఉంటుంది.

# గ్రీన్ చానల్, అంబులెన్స్, కోసం సిగ్నలింగ్

హైదరాబాద్, : హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని దష్టిలో పెట్టుకుని... అంబులెన్సులు, అత్యవసర సేవలు, ప్రముఖుల వాహనాల కోసం ప్రత్యేక సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు జీహెచ్‌ఎం సీ కసరత్తు చేస్తోంది. ఆయా వాహనాలు సిగ్నల్‌కి సమీపింలోకి రాగానే.. ఆటోమేటిక్‌గా గ్రీన్ సిగ్నల్ పడేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఈ నూతన విధానం వల్ల సీఎం, మంత్రులు, గ్రీన్ చానెల్ వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుకోక్కుండా వేగంగా వెళ్లిపోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లకు ఈ నూతన విధానం ఎంతో మేలు చేస్తుందని భావిస్తున్నారు. భాగ్యనగరంలో ట్రాఫిక్ రద్దీ గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. ఉదయం 7 గంటల ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. సీఎం, మంత్రులు వంటి ప్రముఖులు వస్తుంటే.. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను ఆపేసి.. వారికి దారి ఇస్తారు. అదే అంబులెన్స్‌లు వస్తే.. ట్రాఫిక్ వాళ్లు రూట్ క్లియర్ చేయరు.. జనాలు కూడా మాకేంటి.. మేం ముందుగా వెళ్లాలి అన్నట్లు అలానే ఉంటారుమనం చేసే చిన్న ఆలస్యం.. అంబులెన్స్‌లో ఉన్న వారి ప్రాణాలకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. అయితే అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం అనే అంశంపై చాలా మంది వాటికి ప్రత్యేకంగా రోడ్డు లేదా.. సైరన్ సౌండ్ విని.. అవి వెళ్లడానికి అనుమతిస్తే బాగుంటుంద ని అభిప్రాయపడుతుంటారు. ఇక తాజాగా గ్రేటర్ అధికారులు కూడా ఇదే ఆలోచన అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.గ్రీన్ చానల్, అంబులెన్స్ , అత్యవసర సేవలు అలానే ప్రముఖుల వాహనాల కోసం జీహెచ్‌ఎంసీ అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి కసరత్తు ప్రారంభించింది. ఈ వెహికల్స్ ప్రాధాన్య క్రమంలో మానవ ప్రమేయం లేకుండానే కూడళ్ల వద్ద నిలిచిపోకుం డా.. ముందుకు సాగిపోయేలా సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. త్వరలో ప్రకటించనున్న టెండర్ నోటిఫికేషన్లో ఈ ప్రత్యేక సదుపాయం కల్పించాలని భావిస్తున్నారు. హైదరాబాద్ పరిధిలోని సిగ్నళ్ల నిర్వహణ కాంట్రాక్టు గడువు సెప్టెంబ రు 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సిగ్నళ్ల ఏర్పాటు తో పాటుగా ఉన్న వాటి నిర్వహణ కోసం త్వరలో టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. ఒక్కో సారి 25 చొప్పున 50 కొత్త సిగ్నళ్లను ఏర్పాటు చేయడమే కాక.. ఇప్పటికే ఉన్న 404 సిగ్నళ్ల నాలుగేళ్ల నిర్వహణకు రూ.70 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పర్యవేక్షణ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటుకు సంబంధించి బుధవారం జీహెచ్‌ఎంసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 14వ తేదీ వరకు ఆసక్తి ఉన్న సంస్థలు తమ ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది.ఈ నూతన విధానం వల్ల సీఎం, మంత్రులు, గ్రీన్ చానెల్ వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుకోక్కుండా వేగంగా వెళ్లిపోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా అంబులెన్స్‌లకు ఈ నూతన విధానం ఎంతో మేలు చేస్తుందని భావిస్తున్నారు. భాగ్యనగరంలో ట్రాఫిక్ రద్దీ గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది.ఉదయం 7 గంటల ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. సీఎం, మంత్రులు వంటి ప్రముఖులు వస్తుంటే.. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను ఆపేసి.. వారికి దారి ఇస్తారు. అదే అంబులెన్స్‌లు వస్తే.. ట్రాఫిక్ వాళ్లు రూట్ క్లియర్ చేయరు..జనాలు కూడామాకేంటి..మేం ముందు గా వెళ్లాలి అన్నట్లు అలానే ఉంటారుమనం చేసే చిన్న ఆలస్యం.. అంబులెన్స్‌లో ఉన్న వారి ప్రాణాలకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. అయితే అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం అనే అంశంపై చాలామంది వాటికి ప్రత్యేకంగా రోడ్డు లేదా.. సైరన్ సౌండ్ విని.. అవి వెళ్లడానికి అనుమతిస్తే బాగుంటుందని అభిప్రాయపడు తుంటారు. ఇక తాజాగా గ్రేటర్ అధికారులు కూడా ఇదే ఆలోచన అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.గ్రీన్ చానల్, అంబులెన్స్ , అత్యవసర సేవలు అలానే ప్రముఖుల వాహనాల కోసం జీహెచ్‌ఎంసీ అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావడానికి కసరత్తు ప్రారంభించింది. ఈ వెహికల్స్ ప్రాధాన్య క్రమంలో మానవ ప్రమేయం లేకుండానే కూడళ్ల వద్ద నిలిచిపోకుండా.. ముందుకు సాగిపోయేలా సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. త్వరలో ప్రకటించనున్న టెండర్ నోటిఫికేషన్లో ఈ ప్రత్యేక సదుపాయం కల్పించాలని భావిస్తున్నారు.హైదరాబాద్ పరిధిలోని సిగ్నళ్ల నిర్వహణ కాంట్రాక్టు గడువు సెప్టెంబరు 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సిగ్నళ్ల ఏర్పాటుతో పాటుగా ఉన్న వాటి నిర్వహణ కోసం త్వరలో టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. ఒక్కో సారి 25 చొప్పున 50 కొత్త సిగ్నళ్లను ఏర్పాటు చేయడమే కాక.. ఇప్పటికే ఉన్న 404 సిగ్నళ్ల నాలుగేళ్ల నిర్వహణకు రూ.70 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పర్యవేక్షణ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటుకు సంబంధించి జీహెచ్‌ఎంసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 14వ తేదీ వరకు ఆసక్తి ఉన్న సంస్థలు తమ ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది.నూతనంగా ప్రవేశపెట్టబోయే సిగ్నలింగ్ వ్యవస్థలో అంబులెన్స్‌లను, అత్యసవర సేవలందించే, ప్రముఖుల కాన్వాయ్‌లు వచ్చే సమయంలో గ్రీన్ సిగ్నల్ దానంతట అది పడేలా నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. ఇందుకోసం ఆయా వాహనం/ వాహనాల నంబర్లు, ఏ మార్గంలో వెళ్తాయన్నదానికి సంబంధించిన సమాచారాన్ని బయలుదేరడానికి ముందే ట్రాఫిక్ పోలీస్ అధికారులకు అందించాలి. అప్పుడు వారుఈ వివరాలను ఐసీసీసీకి పంపుతారు.

# బీసీల వైపే దేశం దృష్టి..

జయశంకర్ భూపాలపల్లి: దేశవ్యాప్తంగా కోరుకున్నట్లుగానే మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం వచ్చే సంవత్సరం 2026 నుండి దేశవ్యాప్తంగా కులగణన చేయడానికి ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామని, కులగణన జరిగిన తర్వాత జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లను కల్పిస్తామని బీసీలకు హామీ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2026లో నిర్వహించబోయే కులగణనలో చేపట్టే విధివిధానాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఎన్నికల ముందు హామీనిచ్చినట్టుగానే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వచ్చి..రాష్ట్రంలో కులగణన చేపట్టి..బీసీలకు 42 శాతం విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో రిజర్వేషన్లను కల్పించేందుకు బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి..ఆ బిల్లుకు ఆమోదం తెలిపి..గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపిస్తే..మూడు నెలల్లో ఆ బిల్లుపై నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం బీసీల పట్ల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తుందని మండిపడ్డారు.10 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయవచ్చు. కానీ..జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు స్థానికంగా 42 శాతం రిజర్వేషన్లను పొందకూడదా..? అని మహేందర్ గౌడ్ బిజెపి నాయకులను నిలదీశారు. హిందుత్వం ముసుగులో వంటకాగుతూ..అగ్రవర్ణాలకు, బ్రాహ్మణులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని ఘాటుగా విమర్శించారు. బీసీల్లో ఉత్పత్తి కులాలు..సేవా కులాలు ఉన్నాయని, దేశంలోని 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాలు దేశ సంపదను సృష్టిస్తే..ఆ సంపదనంతా 10 శాతం ఉన్న అగ్రవర్ణాలకు దోచిపెడుతున్న ప్రభుత్వాల భరతం పడతామని మహేందర్ గౌడ్ హెచ్చరించారు. మా సోదరులు ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అది జరగాల్సిందే..చివరకు అగ్రవర్ణాలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు కానీ సామాజిక వర్గం ఏదైనా ఉందంటే అది బీసీ లేనని..మరీబీసీలు చేసిన పాపం ఏంటని..? ఆయన పాలకులను నిలదీశారు. బీసీలుగా పుట్టడమే మా శాపమా..? ఈ అగ్రవర్ణ పార్టీలు, పాలకులకు ఓట్లు వేయడమే మేము చేసుకున్న పాపమా..? ఇదెక్కడి న్యాయం..అందరికీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు..బీసీలకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. బీసీల సమాగ్రాభివృద్ధిని..దేశాభివృద్ధిగా చూసినట్లయితే రాష్ట్రంలో, దేశంలో 60 శాతం జనాభా ఉన్నటువంటి బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినప్పుడే దేశం స్వర్ణ భారత్..అఖండ భారత్ గా విరాజిల్లుతుందన్నారు.

# ధరణిలో మాయమైన కోట్లాది ఎకరాలు..?

## నాలుగు జిల్లాల్లో కనిపించని లెక్కలు

హైదరాబాద్: కాళేశ్వరం పెద్ద స్కామని.. అందులో వేలకోట్ల అక్రమాలు జరిగాయని రేవంత్ నుంచి మొదలు పెడితే ఉత్తంకుమార్ రెడ్డి వరకు ఆరోపిస్తుంటారు. దాని తర్వాత గొర్రెలు.. ఫార్ములా ఈ రేస్ కుంభకోణాలు ఉంటాయని అంటుంటారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజలు అసలు విషయాన్ని మర్చిపోతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ధరణి గురించి గులాబీ నేతలు గొప్పగా చెప్పుకున్నారు. తెలంగాణ భూ రికార్డులు మొత్తం డిజిటలైజ్ చేసామని.. వాటిని సరికొత్తగా మార్చామని వివరించారు. కానీ ఆ ధరణి పెద్ద మోసమని.. అందులోనే పెద్ద వ్యవహారం ఉందని అప్పట్లోనే ఆరోపణలు వినిపించాయి. ఇప్పటికీ కూడా ధరణి పాపాలు తెలంగాణ రైతుల ఉసురు తీసుకుంటూనే ఉన్నాయి. తాజాగా దీనికి సంబంధించి ఒక కీలక విషయం బయటకు వచ్చింది.తెలంగాణ రాష్ట్రంలో ధరణి రాక ముందుకు పట్టా భూములు 1.30 కోట్ల ఎకరాల వరకు ఉండేవి. ధరణి వచ్చిన తర్వాత ఏకంగా 25 లక్షల ఎకరాలకు పట్టా భూములు పెరిగాయి. ఫలితంగా 1.55 కోట్ల ఎకరాలకు పట్టా భూములు పెరిగిపోయాయి. ఇదే సమయంలో ప్రభుత్వ, అటవీ, దేవాదాయ, వివాదాస్పద, వక్ఫ్ భూములు మాయమయ్యాయి. ధరణిలో భూములు మాయమైన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్ గిరి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాలలో అత్యధికంగా భూములు మాయమైనట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతాలలో భూముల ధరలు అధికంగా ఉండడంతోనే మాయమైనట్టు తెలుస్తోంది. కొన్ని జిల్లాలలో కలెక్టర్లు నోటిఫై చేయడానికి నిరాకరించిన భూములను కూడా టీజీటీఎస్ ద్వారా తమకు అనుకూలంగా మార్చుకున్నట్టు తెలుస్తోంది.గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ను ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహించింది. గత సర్కార్ పెద్దలు, చీఫ్ సెక్రటరీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే భూములలో మార్పులు చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు భూముల నిర్వహణకు సంబంధించి చేసిన ఫోరెన్సిక్ ఆడిట్ కంటే ముందే టెర్రాసిస్ అనే సంస్థ ఈ వ్యవహారాన్ని అధికారులకు చెప్పింది. మార్చిన భూములకు సంబంధించిన వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి అందించింది. కాళేశ్వరం కేసును ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థ చేతిలో పెట్టింది రేవంత్ ప్రభుత్వం. ఇంకా కొన్ని కేసులను కూడా కేంద్ర దర్యాప్తు సంస్థకు ఇవ్వడానికి రెడీగా ఉంది. అసలు గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన కుంభకోణాల కంటే అతి పెద్ద మాయాజాలం ధరణి. ఇన్ని వివరాలు తెలిసాయి కాబట్టి రేవంత్ ప్రభుత్వం ఇప్పటికైనా గులాబీ నేతలను బయటికి లాగుతుందా.. కటకటాల వెనక్కి పంపుతుందా.. అర్హులైన వారికి న్యాయం చేస్తుందా.. ఈ ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.

# స్వస్థలాకు సేఫ్ గా ఆంధ్రులు..

విజయవాడ: ఏపీ మంత్రి నారా లోకేష్ కృషి ఫలించింది. ఆయన చొరవతో నేపాల్ నుంచి ఏపీ వాసులు క్షేమంగా చేరుకున్నారు. నేపాల్ లో ఆందోళనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. హింసతో నేపాల్ అట్టుడుకి పోతోంది. ఈ నేపథ్యంలో నేపాల్ వెళ్లిన తెలుగు ప్రజల భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అయ్యింది. నేపాల్ వెళ్లిన బాధిత కుటుంబాలు ఆందోళనతో ఉన్నాయి. ఈ తరుణంలో నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించేందుకు మంత్రి నారా లోకేష్ రంగంలోకి దిగారు. ఢిల్లీలో ఏపీ భవన్‌తో పాటు నేపాల్ లో ఉన్న భారత రాయబార కార్యాలయంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకున్నారు. నేరుగా బాధితులతో వీడియో కాల్ లో మాట్లాడుతూ తగు జాగ్రత్తలు సూచించారు. అక్కడ నుంచి స్వస్థలాలకు క్షేమంగా బయలుదేరేలా ఏర్పాట్లు చేయడంలో నరాల్లోకే సక్సెస్ అయ్యారు.కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్న క్రమంలో 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' పేరుతో అనంతపురంలో కూటమి ప్రభుత్వం విజయోత్సవ సభ నిర్వహించింది. అయితే ఆ సభకు మంత్రి నారా లోకేష్ వెళ్లలేదు. సచివాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్ నుంచి సహాయక చర్యలను పర్యవేక్షించారు.ఈచర్యలు ఫలించి నేపాల్ లో చిక్కుకున్న తెలుగు ప్రజలు స్వదేశానికి పయనం అవుతున్నారు. నేపాల్ లో 12 ప్రాంతాల్లో 217 మంది ఏపీ వాసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిని ఏపీకి రప్పించేందుకు చర్యలు ప్రారంభించారు. తొలివిడతగా నేపాల్ లోని హెటౌడా నుంచి 22 మంది ఏపీ వాసులను సురక్షితంగా బీహార్ సరిహద్దు ప్రాంతాలకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఏపీకి రప్పించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తమను క్షేమంగా తీసుకురావడంపై ఏపీ ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.వరోవైపు ఖాట్మండు పరిసరాల్లో ఉన్న 173 మందిని తరలించేందుకు గురువారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక విమానం ఢిల్లీ నుంచి నేపాల్ వెళ్లింది. అక్కడ కర్ఫ్యూ సడలించిన వెంటనే ఏపీకి బయలుదేరనుంది. మిగతా 173 మందిని విశాఖ, వారికి ధైర్యం చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి క్షేమంగా తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యేక విమానాలు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారి కోసం ఢిల్లీలోని ఏపీ భవన్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.+91 98183 95787 నంబర్ను అందుబాటులో ఉంచారు. 24 గంటలు సేవలందించేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్ అక్కడ కొనసాగుతోంది. నేపాల్ లో చిక్కుకున్న బాధితులు నేరుగా సంప్రదించే వీలుగా ఏర్పాట్లు చేశారు.

# వైజాగ్ లో పేకాట క్వీన్స్



విశాఖపట్టణం, : కాలం మారిపోయింది. ఎన్నో రకాల రుగ్మతలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. ముఖ్యంగా మానవ తప్పిదాలు పెరుగుతున్నాయి. జూదమాటలతో పాటు వ్యసనాల బారిన ఎక్కువ మంది పడుతున్నారు. అయితే ఇప్పుడు మహిళలు కూడా వ్యసనాల బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. విశాఖపట్నంలోజూదం ఆడుతూ ఆరుగురు మహిళలు పోలీసులకు పట్టుబడటం విశేషం. ఇప్పటివరకు పురుషులే జూద మాటలు ఆడడం చూస్తుంటాం. కానీ ఇప్పుడుమహిళలు సైతం అనుసరించడం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఓ భర్త, ఇంట్లో భార్య రోజూ బయటకు వెళ్లి రావడాన్ని గమనిస్తూ, పేకాట ఆడుతోందని అనుమానంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మొదట్లో స్థానిక పోలీసు స్టేషన్లో అతని ఫిర్యాదును పట్టించుకోకపోయినా, పైఅధికారి స్థాయిలోచెప్పడంతో వ్యవహారం ఊహించని మలుపు తిరిగింది. చివరకు పోలీసుల దాడిలో అసలు గుట్టు వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన వారు ఎవరూ ఊహించని విధంగా మహిళలు కావటం, అంతా ఒకే ప్రాంతంలో కూర్చుని పేకాట ఆడుతుండటం స్థానికులను ఆశ్చర్యకితులను చేసింది. గుట్టు చప్పుడు కాకుండా? గుట్టు రట్టు విశాఖలోని ఒక నివాస భవనం పేకాట 'అడ్డా'గా మారింది. నిత్యం పేకాట ఆడుతున్న ఆరుగురు మహిళలు లలిత నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో రొటీన్‌గా జూదంలో మునిగిపోయారు. అయితే మామూలుగా ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరిస్తూ వస్తుండగా, భర్త తన భార్యపై పెట్టిన అనుమానం పోలీసులకు ఫిర్యాదుగా మారింది. టాస్క్ ఫోర్స్‌రంగంలోకి.. ఆరుగురు మహిళలు అదుపులోకి భర్త ఫిర్యాదుతర్వాత నగరంలోని టాస్క్ ఫోర్స్ పోలీసులు సీక్రెట్‌గా సమాచారం సేకరించి, లలిత నగర్‌లో ఆ ఇంటిపై దాడి చేశారు. సరిగ్గా అందరూ ఆటలో ఉండగా.. పోలీసులు అక్కడికి చేరుకొని ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు.

వారి వద్ద నుండి రూ.22, 000నగదును స్వాధీనం చేసుకున్నారు.

కేసు నమోదు, దర్యాప్తు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇప్పటివరకు ఆ మహిళల వివరాలు సేకరించి, స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. అంతే కాకుండా, ఈ గృహం ఎవరిది? ఇలాంటివే ఇంకెన్ని ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. పట్టుబడిన మహిళలు సంతానం తో ఉన్న గృహిణులు కావటం, ఆర్థిక అవసరాలు లేదా మోజు కారణంగా ఇలా జరిగిందా అన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇంటి తలుపులు మూసుకుని.. పేకాటలో మునిగిన రాణులు ఈ ఘటన వెలుగులోకి రావడంతో ఆ ప్రాంత ప్రజలలో ఆందోళన నెల కొంది. ఇక్కడ ఇలాంటి పనులు జరుగుతున్నాయనేది ఊహించలేదు.. గృహిణులు ఇలాంటివి చేస్తే పిల్లలకు ఏం బుద్ధి వస్తుంది? అంటూ కొంతమంది స్థానికులు మాట్లాడారు. ఇక పట్టుబడిన మహిళల కుటుంబ సభ్యులు మాత్రం మౌనమే వహిస్తున్నారు. ఆడవాళ్లు ఇలాంటివి చేస్తే కుటుంబం నాశనం అవుతుందని కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. విశాఖపట్నం లలితా నగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో మహిళలు గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే నాలుగోపట్టణం పోలీసు లు రంగంలోకి దిగారు.టాస్క్ ఫోర్స్ పోలీసులతో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి 22వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఈ ఘటన కలకలం రేపింది.అయితే ఈ మహిళలు తరచూ వారి ఇళ్లలో పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. ఓ అజ్ఞాత వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు రంగంలోకి దిగిఅరెస్టు చేసినట్లు ప్రచారం జరుగు తోంది. అయితే ఈ ఆరుగురు మహిళల్లో ఓ మహిళ భర్త గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఎటువంటి చర్యలు లేకపోవడంతో నేరుగా పోలీసు ఉన్నతాధికారికి ఫిర్యాదుచేయగా.. వారు యాక్షన్ లోకి దిగినట్లు సమాచారం. లలితా నగర్ ప్రాంతంలో ఒక భవనంలో మినీ పేకాట క్లబ్ నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అక్కడ నిత్యం మహిళలు కనిపిస్తుంటారు. గతంలో ఓసారి మహిళలు పేకాడుతూ పట్టుబడగా పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి విడిచి పెట్టారట.




# బ్యాంకుల పరిధిలోనే

## మినిమమ్ బ్యాలెన్స్ వ్యవహారం

**ఈ వ్యవహారం ఆర్‌బిఐ పరిధిలో లేదన్న గవర్నర్ మల్హోత్రా**

గాంధీనగర్, : బ్యాంకులో ఖాతాదారుల అకౌంట్స్‌లో మినిమమ్ బ్యాలెన్స్ నిబంధన అన్నది ఆయా బ్యాంకులకున్న స్వేచ్ఛ అని, ఇందులో ఆర్‌బిఐ జోక్యం ఉండదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. బ్యాంకు ఖాతాల్లోని కనీస నిల్వల అంశంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. మినిమమ్ బ్యాలెన్స్ ఎంత ఉండాలనేది పూర్తిగా బ్యాంకుల నిర్ణయమని చెప్పారు. దీనిపై ఆర్‌బీఐ నియంత్రణ ఏదీ ఉండదని పేర్కొన్నారు. కనీస బ్యాలెన్స్ పరిమితిని ఐసీఐసీఐ బ్యాంక్ గరిష్ఠంగా రూ.50 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్న వేళ గుజరాత్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమం పాల్గొన్న సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ మీడియాతో మాట్లాడారు. కనీస సగటు- బ్యాలెన్స్ ఎంత ఉండాలి అనే నిర్ణయం ఆర్‌బీఐ బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు రూ.10వేలు నిర్ణయిస్తాయి. మరికొన్ని రూ.2 వేలు ఉంచుతాయి. కొన్ని కనీస బ్యాలెన్స్ నిబంధనను ఎత్తివేశాయి. ఈ అంశం ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోకి రాదని సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ఇటీవల కొన్ని బ్యాంకులు ఎత్తివేస్తుండగా, ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అందుకు భిన్నంగా ఖాతాదార్లకు షాకిచ్చింది. సేవింగ్స్ అకౌంట్లోల కనీస నిల్వ మొత్తాన్ని భారీగా పెంచేసింది. ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచిన వారికే ఇది వర్తించనుంది. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఖాతాదార్లు కనీసం రూ.50,000 నిల్వ ఉంచాలి. గతంలో ఈ మొత్తం సెమీ అర్బన్ ఖాతాదార్ల కనీస నిల్వ మొత్తాన్ని రూ.5,000 నుంచి రూ.25,000కు, గ్రామీణ ఖాతాదార్లకు రూ.2,500 నుంచి రూ.10,000కు సవరించింది. కనీస నిల్వ లేనిపక్షంలో ఛార్జీలు కనీస నిల్వకు ఎంత తక్కువ మొత్తం ఉంటు-ందో దానిపై 6 శాతం లేదా రూ.500 ఏది తక్కువైతే అది చెల్లించాల్సి ఉంటుందని ఐసీఐసీఐ బ్యాంక్ వెల్లడించింది. అయితే దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ధరలు ఉన్నా దిగుబడులు లేవు..!



రాజమహేంద్రవరం: వర్షాలు, ప్రకృతి విపత్తులతో అరటి రైతులు నిండా మునిగిపోయారు. దక్కిన కాస్త పంటకు టన్ను రూ. ఐదు వేలు పలకడంతో మరింత నిరాశకు గురయ్యారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధరలేకపోవడంతో కొంత మంది రైతులు పంటను తొలగించారు. మరికొందరు అరటి గెలలను రోడ్డు పక్కన పడేశారు. ప్రస్తుతం పండుగ సీజన్లు కావడంతో కాస్తంత ధర పెరిగినా దిగుబడి లేదు. ఇతర రాష్ట్రాల్లో ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో మార్కెట్‌లో ప్రస్తుతం టన్ను రూ.15 వేల నుంచి రూ.16 వేల వరకూ హోల్‌సేల్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీ పేట మండలాల్లో విస్తారంగా అరటి సాగుచేశారు. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి తదితర మండలాల్లో కలిపి అధికారిక గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 వేల ఎకరాల్లోఅరటిసాగవుతుంది. రావులపాలెం మార్కెట్ నుంచి ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కలకత్తా తదితర రాష్ట్రాలకు ప్రతి రోజూ 80 లారీల్లో ఎగుమతి చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో సుమారు 150కి పైగా లారీలు, ఇతర వాహనాలతో అరటి ఎగుమతి అవుతోంది. రావులపాలెం, ఆత్రేయపురం అరటికి మంచి డిమాండ్ ఉంటుంది. సైజు, లావు, నాణ్యతతో పాటు రుచి, సువాసన కలిగి ఉంటాయి. ప్రధానంగా కర్పూరం, తెల్ల చక్రకేళి, బుసావళి ఎర్ర చక్రకేళి, తదితర రకాల అరటిని రైతులు సాగు చేస్తున్నారు. గతేడాది మొంథా తుపాను అరటి పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఈదురుగాలులకు కొన్ని చెట్లు నేలవాలగా, వర్షాలకు తెగుళ్లు దాడి చేశాయి. జిల్లాలోని 45 వేల ఎకరాలకు సుమారు ఎనిమిది లక్షల టన్నుల అరటి దిగుబడి వచ్చేది. తుపాను ప్రభావంతో ఈ ఏడాది 6.75 లక్షలకు పడిపోయింది. వాతావరణ పరిస్థితులు బాగుంటే ఎకరాకు 15 టన్నుల నుంచి 20 టన్నుల అరటి దిగుబడి వచ్చేంది. కాని ప్రస్తుతం ఎకరాకు 10 నుంచి 15 టన్నుల దిగుబడి మాత్రమే వస్తుందని రైతులు చెబుతున్నారు. తాజాగా డిమాండ్‌కు తగినట్లుగా దిగుబడి లేకపోవడంతో ధరలు పెరిగినా పెద్దగా లాభం లేదని రైతులు అంటున్నారు.

# 8 వేల కోట్లతో మంచినీటి సరఫరాకు ప్రణాళికలు



హైదరాబాద్,: హైదరాబాద్ సిటీలో తాగునీటి ఎద్దడి లేకుండా, అన్ని ప్రాంతాలకు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేందుకు జలమండలి రూ. 8,000 కోట్ల భారీ వ్యయంతో ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరానికి నీటిని అందించే కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా మరియు జంట జలశయాల (ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్) వనరులను ఒకే గొడుగు కిందకు తెస్తూ,నగరం చుట్టూ 140 కిలోమీటర్ల మేర 'రేడియల్ రింగ్ మెయిన్' పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ప్రధాన పైపులైన్లు వేసి, దానికి అనుసంధానంగా మరో 96 కిలోమీటర్ల మేర అంతర్గత నెట్‌వర్క్‌ను నిర్మించడం ద్వారా నగరం నలుమూలలకూ నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనున్నారుగతంలో కేవలం జంట జలశయాలపై ఆధారపడిన నగరం, ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల నుండి నీటిని పొందుతోంది. అయితే, ఏదైనా ఒక ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు జరిగినా లేదా సాంకేతిక సమస్యలు తలెత్తినా ఆయా ప్రాంతాల్లో సరఫరా పూర్తిగా నిలిచిపోతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు 'రింగ్ మెయిన్' వ్యవస్థ కీలకం కానుంది. దీనివల్ల ఒక మార్గంలో అంతరాయం కలిగినా, ఇతర వనరుల నుండి నీటిని మళ్లించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయవచ్చు. రాబోయే రెండేళ్లలో గోదావరి 2, 3 దశలు కూడా అందుబాటులోకి రానుండటంతో, ఈ రింగ్ మెయిన్ ద్వారా 24 గంటల పాటు సమాన ఒత్తిడితో నీటిని అందించడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ సిటీకి అంతరాయం లేని తాగునీటి సరఫరాను అందించేందుకు ప్రతిపాదించిన అత్యంత కీలకమైన పైపులైన్ నెట్‌వర్క్‌ను 'రింగ్ మెయిన్' అని పిలుస్తారు. ప్రధానంగా హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఈ ప్రధాన పైపులైన్‌ను ఒక వలయంలా ఏర్పాటు చేస్తారు. ఇది నగరంలోని పలు ప్రాంతాలను కలుపుతూ ఉండే ప్రత్యేక పైపులైన్లతో అనుసంధానమై ఉంటుందిసాధారణంగా ఏదైనా ఒక ప్రధాన పైపులైన్ దెబ్బతింటే ఆ ప్రాంతానికి నీటి సరఫరా నిలిచిపోతుంది. కానీ, ఈ రింగ్ మెయిన్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే, ఒక దిశలో మరమ్మతులు జరుగుతున్నప్పటికీ, వలయంలా ఉన్న ఇతర పైపులైన్ల ద్వారా నీటిని మళ్లించి నిరంతరాయంగా సరఫరా చేయడానికి వీలుంటుందని అధికారులు ప్లాన్ చేశారు. దీనివల్ల నగరవ్యాప్తంగా నీటి పంపిణీలో ఎలాంటి అవాంతరం లేకుండా నియంత్రించవచ్చు. హైదరాబాద్ నగరానికి ప్రస్తుతం రోజుకు సుమారు 600 మిలియన్ గ్యాలన్లు పైగా నీటి అవసరం ఉంది. కృష్ణా (మూడు దశలు), గోదావరి (మొదటి దశ) ద్వారా మెజారిటీ అవసరాలు తీరుతున్నాయి. రిజర్వాయర్లు నిర్మాణం: రింగ్ మెయిన్ ప్రాజెక్టులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి కీలక ప్రాంతాల్లో భారీ స్టోరేజ్ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. ఇది భవిష్యత్తులో పెరిగే జనాభా అవసరాలకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది. డిజిటల్ మానిటరింగ్: ఈ కొత్త పైపులైన్ వ్యవస్థలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నా లేదా నీటి ఒత్తిడి తగ్గినా వెంటనే గుర్తించేలా అత్యాధునిక స్కాడా టెక్నాలజీని ఉపయోగించే అవకాశం ఉంది.

# సినిమా మంత్రికి తెలియకుండా.. జీవోలా?

హైదరాబాద్: తెలంగాణలో ప్రస్తుతం థియేటర్ల కంటే సెక్రటేరియట్ లోనే పెద్ద సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా నడుస్తోందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా, ఉంటే అది ఎవరి కంట్రోల్‌లో ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సినిమా టికెట్ల ధరల పెంపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, సంబంధిత సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలు గందరగోళానికి దారితీస్తున్నాయి. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. టికెట్ల పెంపు జీవోల గురించి తనకు తెలియదని, తన దగ్గరకు ఫైల్ రాలేదని చెప్పడం హాట్ టాపిక్ అవుతోంది. ఒక కేబినెట్ మంత్రికి తెలియకుండానే ఆయన శాఖలో ఇంతపెద్ద నిర్ణయం ఎలా జరిగిందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. హోం శాఖ నుండి నేరుగా జీవోలు వస్తుంటే, అసలు ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్న రాజ్యాంగేతర శక్తి ఎవరని నిలదీశారు. గతంలో అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తాను సీట్లో ఉన్నంత కాలం టికెట్ల రేట్ల పెంపు, బెనిఫిట్ షోలు ఉండవని ప్రగల్భాలు పలికారని, కానీ ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎలా విడుదలవుతున్నాయని హరీష్ రావు ప్రశ్నించారు. ఇప్పటికే మూడు సినిమాలకు అడ్డగోలుగా రేట్లు పెంచారని, ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. సినిమా పరిశ్రమను తెలంగాణ ప్రభుత్వం తన రాజకీయ కక్షలకు వేదికగా మార్చుకుందని బిఆర్ఎస్ ఆరోపించింది. "వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే" అన్నందుకు ఒక హీరో సినిమాపై కక్ష గట్టడం, పేరు మర్చిపోయినందుకు మరో హీరోను జైలుకు పంపడం వంటి చర్యలు పాలకుడికి తగవని హరీష్ రావు హితవు పలికారు. నచ్చిన వారికి రూ. 600 టికెట్ రేటుకు పర్మిషన్ ఇస్తూ, ఇతరులకు వివక్ష చూపుతున్నారని విమర్శించింది. ఇటీవల ప్రభాస్ లేటెస్ట్ మూవీ రాజా సాబ్ విషయంలోనూ పాలిటిక్స్ జరిగాయని, డార్లింగ్ ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు. టికెట్ రేట్లపై సకాలంలో నిర్ణయం జరగలేదన్న విమర్శలున్నాయి. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో సినిమా పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, అందుకే తెలుగు సినిమా ఆస్కార్ స్థాయికి ఎదిగిందని ఈ సందర్భంగా హరీష్ రావు గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న కమిషన్ల దందాపై రాష్ట్ర గవర్నర్ దృష్టి సారించాలని, సంబంధిత శాఖ మంత్రి కోమటిరెడ్డికి తెలియకుండా విడుదలవుతున్న జీవోలపై సమగ్ర విచారణ జరపాలని బిఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు.

# సైబర్ దాడి వ్యూహం..

న్యూఢిల్లీ, జనవరి 16,: ట్రిగర్ జారలేదు, గుండు బయల్దేరలేదు, మిసైల్ ప్రయోగం జరగలేదు. అయినా వెనెజువెలాలో పూర్తి యుద్ధం జరిగి ముగిసింది. అమెరికా విమానాలు ఎగరకుండా, రాడార్లు మౌనంగా మారాయి. అధ్యక్షుడు మదురో దంపతులు అదుపులోకి రాలేదు. ఇది సైబర్ యుద్ధం ? నాలుగు సంప్రదాయ యుద్ధాలకు (నేల, ఆకాశ, సముద్ర, స్పేస్) ఐదవ అధ్యాయం. ప్రపంచ యుద్ధ చరిత్రలో కొత్త అధ్యాయం రాసిన ఈ ఘటన ప్రతి దేశానికి పాఠాలు చెబుతోంది. వెనెజువెలా విద్యుత్ గుర్రం గురీ డ్యామ్ సూపర్ విజరీ సిస్టమ్ మొదట లక్ష్యం. రెండు కీలక టార్గెట్లతో మొత్తం విద్యుత్ సరఫరా కట్ అయింది. మిలటరీ అంధకారంలో మునిగింది. రాడార్లు ఆఫ్, ఎయిర్‌ఫోర్స్ ఇన్వర్టర్లపై ఆధారపడింది. ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ కూడా నిలిచిపోయింది. టెలిఫోన్లు పనిచేయలేదు, సమాచార బదిలీ ఆగిపోయింది. రాడార్లు రీబూట్ అయ్యే ముందే 150 అమెరికా విమానాలు దేశంలోకి చేరాయి. ఇది ఒక్కరోజు ఆపరేషన్ కాదు. 10?15 ఏళ్లుగా అమెరికా సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ చిప్స్‌లో మాల్‌వేర్ ఏర్పాటు చేసింది. ఎప్పుడు కావాలంటే ఆ సిస్టమ్ షట్‌డౌన్ చేసే సామర్థ్యం కలిగింది. వెనెజువెలా చిప్స్ ఆధారంగా ఉండటం వల్ల వారి ప్రత్యేక రక్షణ లేకపోయింది. దొంగల మార్గాలు, సైనిక కదలికలు అన్నీ అమెరికాకు తెలిసాయి. యుద్ధ సమయంలో విద్యుత్ అంతరాయం తప్పనిసరి. సోలార్, జనరేటర్లు సిద్ధంగా ఉండాలి. విదేశీ చిప్స్, సాఫ్ట్‌వేర్‌లో బ్యాక్‌డోర్ ఉండే అవకాశం. స్వదేశీ సాంకేతికతపై ఆధారపడాలి. సైబర్ దాడులకు తట్టుకునే ఆల్టర్నేటివ్ నెట్‌వర్క్‌లు అవసరం

# కొత్త కార్డుల కష్టాలు..!



వరంగల్, : తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిన ప్రభుత్వం.. కొత్త వారికి కూడా సెప్టెంబర్ కోటా రేషన్ విడుదల చేసింది. అయితే వీరిలో చాలా మందికి డీలర్లు రేషన్ ఇవ్వడం లేదు. కారణం ఈకేవైసీ పూర్తి చేయకపోవడం. కొందరు ఈకేవైసీ పూర్తి చేసినా.. ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో వారి రేషన్ కార్డు ఈకేవైసీ రావడం లేదు. దీంతో వారంతా ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. జూన్ నెలలోనే మూడు నెలల రేషన్ పంపిణీ చేసిన ప్రభుత్వం తిరిగి రేషన్ పంపిణీ ప్రారంభించింది. కొత్తగా రేషన్ కార్డు పొందిన వారికి కూడా రేషన్ పంపిణీ చేస్తున్నారు. అయితే కొత్తగా కార్డు పొందిన వారితో పాటుగా.. పాత రేషన్‌కార్డు హోల్డర్లకు ఆధార్ కార్డుకు సంబంధించిన ఓ ఇష్యూ వల్ల సమస్య ఎదుర్కొంటున్నారు. దీంతో డీలర్లు వారికి బియ్యం ఇవ్వడం లేదు. ఇంతకు సమస్య ఏంటి అంటే..రేషన్‌కార్డు దారులు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత రెండేళ్ల నుంచి చెబుతూనే ఉన్నాయి.


## ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

పైగా ఈకేవైసీ అప్‌డేట్ కోసం గడువు పెంచుతూపోతున్నాయి. అయినా సరే ఇంకా కొందరు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయలేదు. అలానే తాజాగా మంజూరు చేసిన కొత్త రేషన్‌కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చారు. వీరికి కూడా సెప్టెంబర్ నెలకు సంబంధించిన రేషన్ కోటా విడుదల చేశారు. అయితే వీరంతా బియ్యం పొందాలంటే కచ్చితంగా ఈకేవైసీ చేయించాల్సిందే అంటున్నారు డీలర్లు. చాలా వరకు జిల్లాల్లో సుమారు 80 శాతం మందికి ఈకేవైసీ పూర్తి కాగా.. మరో 20 శాతం మంది మాత్రం ఇంకా పూర్తి చేయలేదు. దీంతో వారికి రేషన్ బంద్ చేస్తామని డీలర్లు చెబుతున్నారు. అయితే వీరిలో కొందరు ఈకేవైసీ చేయించుకున్నప్పటికీ.. వీరి వేలి ముద్రలు అప్‌డేట్ కావడం లేదు. దీని గురించి ఆరా తీయగా.. సదరు వ్యక్తుల ఆధార్ కార్డు అప్‌డేట్ కాలేదని.. అందుకే వారి ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కాలేదని తెలిసింది. చిన్నారులకు ఆధార్ కార్డు అప్‌డేట్ చేయకపోవడం వల్ల వారు ఈకేవైసీకి దూరం అయ్యి.. రేషన్ బియ్యం పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో వీరంతా ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే పలు జిల్లాల్లో ఆధార్ కేంద్రాలు తక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని మండలాల్లో ఆధార్ కేంద్రాలు లేవు. దీంతో వీరు ఇతర మండలాలకు వెళ్తున్నారు. దీంతో పలు ఆధార్ కేంద్రాల వద్ద జనాలు పెద్ద సంఖ్యలో క్యూ కడుతున్నారు. అధికారులు మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది అంటున్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఆలస్యం అయినా పర్లేదు కానీ.. ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకుంటే మంచిది అంటున్నారు. ఆధార్‌కు ఈ-పాస్ యంత్రాన్ని అనుసంధానం చేయడంతో.. తప్పుడు వ్యక్తులు బియ్యం తీసుకోవడానికి వీలుండదు. అందుకే కేవైసీ నిబంధన తప్పనిసరి చేశారు.

# సిసిఆర్‌సి కార్డు ఉన్నా 'అన్నదాతా సుఖీభవ'కు దూరం

బూర్జ : కౌలు రైతులను అన్నదాతా-సుఖీభవ పథకానికి ప్రభుత్వం దూరం చేసింది. ప్రస్తుతం పంట సాగు హక్కుదారుల పత్రం (సిసిఆర్‌సి కార్డు) ఉన్న వారు, గతంలో రైతు భరోసా అందుకున్న వారు సైతం ఇప్పుడు ప్రభుత్వ సాయానికి నోచుకోలేకపోతున్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేసినా ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం వారిని పరిగణనలోకి తీసుకోలేదు. కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదనే సాకుతో వారికి ఈ పథకాన్ని వర్తింపజేయడం లేదు. కౌలు కార్డులు దక్కినా, దాని ఫలితం మాత్రం కౌలు రైతులు పొందలేకపోతున్నారు. విత్తనాల పంపిణీ దాదాపు పూర్తయిన తర్వాత కార్డులు ఇవ్వడం వల్ల ప్రయోజనం లేకుండా పోతోంది. బ్యాంకు రుణాలూ దక్కడం లేదు. భూ యజమానులు అప్పటికే ఆ భూమిపై రుణం తీసుకోవడంతో కౌలు రైతులకు బ్యాంకర్లు రుణం మంజూరు చేయడం లేదు. రాష్ట్ర వ్యాప్తం గా ఈ ఏడాది పది లక్షల మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులను జారీచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జూన్ రెండో వారంలో కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టింది. ఇప్పటివరకు మొత్తం 4,58,987 మందికి జారీ అయ్యాయి. సర్వే నంబర్లు ఆధారంగా 2,86,383 మందికి, భూ సమగ్రసర్వే జరిగిన చోట ల్యాండ్ పార్శిల్ మ్యాప్ ఆధారంగా 1,72,604 మందికి అందించింది. కౌలు రైతులను గుర్తించి సిసిఆర్ సి కార్డుల జారీని సులభతరం చేస్తామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన పంట సాగు హక్కుదారుల చట్టం-2019నే యథాతథంగా అమలు చేసింది. దీంతో, భూ యజమానుల దయాదాక్షిణ్యంపైనే కార్డుల జారీ ప్రక్రియ సాగుతోంది. తమ భూమిపై భవిష్యత్తులో కోర్టులకు వెళ్తారన్న భయం, పిఎం కిసాన్, రైతు భరోసా, అన్నదాతా సుఖీభవ వంటి పథకాలు తమకు రావనే ఉద్దేశంతో అంగీకార పత్రాలపై సంతకాలు చేసేందుకు చాలాచోట్ల భూ యజమానులు అంగీకరించలేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో ఒకట్రెండు ఎకరాల భూమి ఉన్న రైతుల్లో కొందరు తమ భూములను కౌలుకి ఇచ్చి వలస వెళ్లిపోతున్నారు. ఆధార్ కార్డు, పాస్ పుస్తకం కాపీలు ఇవ్వడానికి, రాతపూర్వక సమ్మతి తెలపడానికి వారు అక్కడి నుంచి ఇక్కడికి రావడానికి ఇష్టపడడం లేదు. అధిక శాతం జిల్లాల్లో సగం మందికి కూడా అందని వైనం: చాలా జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో సగం మందికి కూడా కార్డులు అందలేదు. తూర్పుగోదావరి జిల్లాలో 1.10 లక్షల మం దికి కార్డులు జారీ చేయాలనేది లక్ష్యం కాగా, ఇప్పటివరకూ 4,63,595 మందికి మాత్రమే అందింది. ఎన్‌టిఆర్ జిల్లాలో 56 వేల మందికి కార్డులను అందించాలనేది లక్ష్యం కాగా,ఇప్పటివరకూ 37,739 మందికి జారీ అయ్యాయి. వైఎస్‌ఆర్ కడపలో 11 వేల మందికి కౌలు కార్డులు ఇవ్వాలనే లక్ష్యం కాగా, 2,919 మందికి మాత్రమే అందాయి.

# ఏపీలో భారీగా పుల్లరిన్ నిక్షేపాలు



కడప: రాయలసీమను రతనాలసీమ గా పేర్కొంటారు. ఖనిజ సంపదకు పెట్టింది పేరు కూడా. అందుకే ఖనిజాల కాణాచి అంటారు. చిత్తూరు, కర్నూలు,కడప, అనంతపురం జిల్లాల్లో ఖనిజ నిక్షేపాలు అధికం. రాయలసీమలో దొరికే ఖనిజ నిక్షేపాలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయని.. ఇది అత్యంత విలువ చేసే గని అని అమెరికా పరిశోధనల్లో తేలినట్లు ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా తిరుపతి జిల్లాలోని మంగంపేట బెరైటీస్ గనుల్లో అరుదైన పుల్లరిన్ ఖనిజా నిక్షేపాలు ఉన్నట్లు పరిశోధనల్లో తేలినట్లు సమాచారం. నానో టెక్నాలజీకి కీలకమైన పుల్లరిన్ వెలికి తీస్తే దేశ భవిష్యత్తే మారిపో తుంది. ప్రస్తుతం దీనిపైనే పెద్ద చర్చ నడుస్తోంది. సుమారు 18సం వత్సరాల కిందట మంగంపేటగనుల్లో భారీగా పుల్లరిన్ నిక్షేపాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అప్పటినుంచి లోతైన అధ్యయనం కొనసాగుతోంది. పుల్లరిన్ అనేది కార్బన్ మిళితమైన ఓ పదార్థం. గోళ, స్థూపాకార ఆకృతుల్లో ఉండే ఖనిజం. అయితే ఇది ఉక్కు కంటే దృఢత్వంలో 2005 రెట్లు ఎక్కువ. పది రెట్లు తేలికైంది కూడా. అ ందుకే అమెరికాలోతైన పరిశోధనలు చేపట్టింది. మిగతా దేశాలు సైతం ఇప్పుడు అదే పనిలో ఉన్నాయి. మంగంపేట బెరైటీస్ గని పరిసరాల్లో మొత్తం 156 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నమూనాలు సేకరించిపరీక్షించారు. భువనేశ్వర్ లోని ఐఎంఎంటీబృందం సైతం ఇక్కడ నమూనాలను సేకరించింది. కానీ తరువాత ఎందుకో సైలెంట్ అయింది. పుల్లరిన్ అనేది ప్రత్యేక ఖనిజం. ఎన్నో రకాల ప్రయోజనాలు దీని సొంతం. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, పిడుగుపాటు నుంచి రక్షణకు విమానాలకు పైపూతగా దీనిని వాడుతారు.

# మరో ఎంపీకి కేంద్ర మంత్రి పదవి..

విజయవాడ: కేంద్ర మంత్రివర్గ విస్తరణ పై ఊహాగానాలు వస్తున్నాయి. త్వరలో ప్రధాని నరేంద్ర మోడీ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ జరుపుతారని ప్రచారం నడుస్తోంది. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిజెపి నేతలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. మిత్రపక్షాలకు సైతం పెద్ద ఎత్తున అవకాశం కల్పిస్తారని కూడా పొలిటికల్ సర్కిల్లో టాక్ నడుస్తోంది. అందులో భాగంగా ఏపీలో తెలుగుదేశం పార్టీకి మరో మంత్రి పదవి ఖాయమని సమాచారం. ఇప్పటికే ఆ పార్టీకి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు ఏపీ నుంచి. ఏపీ నుంచి బిజెపికి ఒక మంత్రి పదవి ఉంది. అయితే జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉండగా.. కాకుండా టిడిపికి మరో పదవి ఇస్తారని ప్రచారం నడుస్తోంది. ప్రధానంగా ఓ సీనియర్ నాయకుడికి ఆ బాధ్యతలు ఇవ్వనున్నట్లు సమాచారం. ఏపీ నుంచి ఎన్డీఏ తరపున 21 మంది ఎంపీలు గెలిచారు. అందులో 16 మంది తెలుగుదేశం పార్టీ నుంచి.. బిజెపి నుంచి ముగ్గురు? జనసేన నుంచి ఇద్దరు గెలిచారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలుగు ఎంపీలకు మాత్రమే పరిమితం అయింది. టిడిపి నుంచి శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్రమంత్రి పదవి దక్కింది. కీలకమైన పౌర విమానయాన చూస్తున్నారు ఆయన. గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ సైతం కేంద్రమంత్రి అయ్యారు. తొలిసారిగా గుంటూరు నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. అయినా సరే ప్రధాని మోదీ తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు. మరోవైపు నరసాపురం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ. ఆయనకు అనూహ్యంగా కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కింది. వాస్తవానికి బిజెపి తరఫున రాజమండ్రి నుంచి గెలిచిన పురందేశ్వరికి కానీ.. అనకాపల్లి నుంచి గెలిచిన సీఎం రమేష్ కు కానీ క్యాబినెట్ పదవి దక్కుతుందని అంతా భావించారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com